# ధనుష్ డీ56లో ప్రీతి ముకుందన్





ప్రజా గళమే

# స్పంద

SPANDHA NEWS

జాతీయ తెలుగు దినపత్రిక

Praja Galame Spanda **సత్యానికి స్వరం** APMUL/26/A3106








మంగళవారం || 29-9-2026 || సంపుటి: 1 || సంచిక: 56 || పేజీలు: 8 || వెల : రూ.5/- Circulated From : Guntur, Vijayawada, Visakhapatnam, Prakasham, Nellore, Thirupathi, Hyderabad, Rangareddy, Medak, Karimnagar, Warangal




## రాష్ట్రం కష్టాల్లో.. సీఎం అజ్ఞాతంలో!

- వరదలు, కరువుతో అల్లాడుతున్న ప్రజలు
- ఇన్ని సమస్యలు వదిలేసి ముఖ్యమంత్రి ఎక్కడికి వెళ్లారు?: లక్ష్మీపార్వతి

3



## రైతుకు కన్నీరు.. ఉద్యోగికి లాఠీచార్జి!

..వివరాలు 3లో

- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ బొత్స సత్యనారాయణ
- సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి
- కళింగపట్నం తుపానుతో భారీగా పంట నష్టం
- నామమాత్రపు సాయం కాదు.. పూర్తి పరిహారం ఇవ్వాలి

'రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉద్యోగులను అణచివేస్తూ.. రైతులను విస్మరిస్తోందని శాసన మండలి ప్రతిపక్ష నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ మండిపడ్డారు.



# ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం!

- అన్యాయమైన డిమాండ్లను అంగీకరించేది లేదు
- 15 వేల మంది స్వర్ణ గ్రామ, వార్డు ఉద్యోగులకు పదోన్నతులు
- రూ. 150 కోట్లు భారం పడినా ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్
- 24 గంటల్లో సెలవు మంజూరయ్యేలా ప్రత్యేక పోర్టల్
- మంత్రి వీరాంజనేయ స్వామి

**అమరావతి, సెప్టెంబర్ 28 (స్పంద న్యూస్):** రాష్ట్రంలోని స్వర్ణ గ్రామ, స్వర్ణవార్డు ఉద్యోగుల ఆచరణ సాధ్యమైన డిమాండ్లన్నిటినీ పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి డాక్టర్ డోల బాల శ్రీ వీరాంజనేయస్వామి స్పష్టం చేశారు. సోమవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం లక్షా 23 వేల మందిని స్వర్ణ గ్రామ, వార్డుల్లో ఉద్యోగులుగా నియామకం చేసి వారి సర్వీసు రూల్స్ గురించి పట్టించుకోకుండా గాలికి వదిలేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక డిప్యూటీ సీఎం అధ్యక్షతన ప్రత్యేక మంత్రివర్గ ఉప సంఘాన్ని నియమించి వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఇప్పటికే 14 వేల మందికి పదోన్నతులు

2 మిగతా 2 లో

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి రాజకీయ పార్టీలు సన్నద్ధమవుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల తర్వాత జరుగుతున్న ఈ పోరు అధికార కూటమికి తొలి పరీక్ష కాగా.. ప్రతిపక్ష వైసీపీకి అస్తిత్వ సవాలుగా మారింది. స్థానికంగా ఉన్న ఆశావహుల ఆకాంక్షలు, మూడు పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు అధికార పక్షానికి కత్తిమీద సాములా మారనుంది. మరోవైపు పల్లెల్లో మళ్లీ పట్టు సాధించేందుకు ఏ ఒక్క స్థానాన్నీ వదిలిపెట్టకూడదని వైఎస్ జగన్ వ్యూహరచన చేస్తున్నారు. గతంలో చోటుచేసుకున్నట్లు భయభ్రాంతులతో కూడిన ఏకగ్రీవాలకు తావులేకుండా.. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు జరగాలని ప్రజలు ఆశిస్తున్నారు.

2029కు సెమీఫైనల్‌కు
**పార్టీలు సిద్ధం**




- స్థానిక సమరానికి సిద్ధమవుతున్న అధికార, ప్రతిపక్షాలు
- అధికార బలం, సంక్షేమ పథకాలతో కూటమి వ్యూహం
- ప్రతి స్థానంలో పోటీ చేయాల్సిందేనంటున్న జగన్

..వివరాలు 3లో

# పల్లెపోరులో పంతాలు

- గత ఎన్నికల్లో ఏకగ్రీవాలపై వెల్లువెత్తిన వివాదాలు
- అభ్యర్థుల ఉపసంహరణలు, కేసులు, పోలీసుల తీరుపై ఆందోళన
- శాంతిభద్రతలే ఎన్నికల సంఘానికి అసలు పరీక్ష

# వ్యర్థాలపై ఉక్కుపాదం!

**ఆక్వా కాలుష్య నివారణపై డిప్యూటీ సీఎం కీలక సమీక్ష**

- తప్పులు సరిదిద్దుకునేందుకు యాజమాన్యాలకు 2 వారాల గడువు
- బీఓడీ, పీహెచ్ స్థాయిల్లో తేడాలు గుర్తించిన అధికారులు
- మత్స్య సంపద, వ్యవసాయాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనదే

వివరాలు 3లో..



# ఆ ఓటమి నాలో కసి పెంచింది!

- పసుపు కుంకుమలతో పట్టాలు పంపిణీ చేసిన మంత్రి లోకేశ్
- 2019 లో ఐదు వేల ఓట్లతో ఓడిపోయినా మంగళగిరిని వదల్లేదు
- సున్నా చేర్చి 92 వేల మెజారిటీతో గెలిపించిన ప్రజలు
- అహర్నిశలూ ఈ నియోజకవర్గ అభివృద్ధిపైనే నా ధ్యాస



.. వివరాలు 2లో



## 18 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియా ఖాతాలు వద్దు

- మైనర్లతో ఒప్పందాలు చట్టబద్ధం కావు
- సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం

4

# ఉజ్జయినిలో ఉద్రిక్తత

**షాహి మసీదు భాగం తొలగింపుపై నిరసన.. పోలీసులతో ఘర్షణ.. రాళ్ల వర్షం**

- పరిస్థితి ఉద్రిక్తం.. బాష్పవాయువు ప్రయోగం
- రంగంలోకి ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్.. భారీగా బలగాల మోహరింపు
- సింహస్థ-2028 కోసం రోడ్డు విస్తరణలో భాగంగా నిర్మాణాల తొలగింపు
- 15 మంది అదుపులోకి.. ఏడుగురిపై కేసులు

..వివరాలు 4లో



# విజయవాడకు ఉత్సవ శోభ

అక్టోబర్ 11 నుంచి 20 వరకు విజయవాడ ఉత్సవ్

- దసరా వేళ ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవం
- కళలు, పర్యాటకంతో స్థానిక వ్యాపారులకు ఊతం
- పున్నమి ఘాట్‌లో తొలిసారి జాతీయ సరస్ మేళా
- కృష్ణా రైజర్ వేదికపై మంత్రి కందుల దుర్గేష్




02

# వ్యర్థాలపై ఉక్కుపాదం!

**ఆక్వా కాలుష్య నివారణపై డిప్యూటీ సీఎం కీలక సమీక్ష**

**అమరావతి, సెప్టెంబర్ 28 (స్పంద న్యూస్):** ఆక్వా వ్యర్థాల కారణంగా ఉత్పన్నమయ్యే అనర్థాల నుంచి జలవనరులను పరిరక్షించే విధంగా నిబంధనలు పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆక్వా ప్రాసెసింగ్, ఆక్వా ప్రీ-ప్రాసెసింగ్ యూనిట్లు నిర్దేశిత పర్యావరణ ప్రమాణాలను తప్పనిసరిగా పాటించేలా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని స్పష్టం చేశారు. జల వనరుల పరిరక్షణ, కాలుష్య నివారణకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. శుద్ధి చేయని ఆక్వా వ్యర్థాల్లో పరిమితికి మించి హానికారక రసాయనాలు ఉండడం వల్ల నదులు, కాలువలు, సాగర సంగమ ప్రాంతాలతో పాటు భూగర్భ జలాలు కూడా కాలుష్య బారినపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆక్వా వ్యర్థాల ప్రభావం, నివారణ చర్యలపై ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీసీబీ) అధికారులకు ఆయన స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు.

**ఉల్లంఘిస్తే కఠిన చర్యలు..**



రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 119 ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్లు, 12 ఆక్వా ప్రీ-ప్రాసెసింగ్ యూనిట్లు పనిచేస్తున్నాయని ఏపీపీసీబీ అధికారులు డిప్యూటీ సీఎంకు వివరించారు. ఇప్పటివరకు 82 యూనిట్ల నుంచి నమూనాలు సేకరించగా, కొన్నింటిలో పీహెచ్ స్థాయిలు, నీటిపై తేలియాడే ఘన వ్యర్థాలు (టీఎస్ఎస్), బీఓడీ వంటి కీలక ప్రమాణాల్లో వ్యత్యాసాలు గుర్తించినట్లు తెలిపారు. పర్యావరణ ప్రమాణాలు పాటించని పది యూనిట్లకు ఇప్పటికే షోకాజ్ నోటీసులు జారీ చేశామని, వివరణతో పాటు దిద్దుబాటు చర్యల కోసం రెండు వారాల గడువు ఇచ్చినట్లు వెల్లడించారు. నిరంతరాయంగా ఉల్లంఘనలకు పాల్పడే యూనిట్లపై చట్ట ప్రకారం కఠిన నియంత్రణ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**జలచర జీవులకు ముప్పు..**

కాలుష్యాన్ని మూలంలోనే గుర్తించి నివారించే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళ్తోందని పవన్ కళ్యాణ్ తెలిపారు. వ్యర్థ జలాల్లో బీఓడీ స్థాయిలు అధికంగా ఉంటే నీటిలో కరిగిన ఆక్సిజన్ శాతం తగ్గి జలచర జీవ వ్యవస్థలు దెబ్బతింటాయని, ముఖ్యంగా మత్స్య సంపదపై తీవ్ర ప్రభావం పడుతుందని వివరించారు. టీఎస్ఎస్ స్థాయిలు పెరిగితే నీటి నాణ్యత క్షీణించి జలచర జీవుల ఆవాసాలు నాశనమవుతాయన్నారు. దీనివల్ల చేపల పెంపకం, వ్యవసాయం, పశుపోషణతో పాటు నీటి వనరులపై ఆధారపడిన గ్రామీణ జీవనోపాధులు ప్రమాదంలో పడతాయని హెచ్చరించారు. ఆక్వా యూనిట్లలో క్రమం తప్పకుండా నమూనాలు సేకరించి పరీక్షలు చేయాలని, యూనిట్లకు దిద్దుబాటు అవకాశం ఇస్తూనే మరోసారి తప్పులు జరగకుండా నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు.

# తాగునీరు సేఫ్!

**కర్నూలు రైల్వే పరిధిలో నీటి నాణ్యత భేష్**

**1,917 నమూనాలు తాగేందుకు అనుకూలం**

**ఎక్కడా లేని ఈ కోలి బ్యాక్టీరియా**

**పటిష్ఠ పర్యవేక్షణ చేస్తున్న దక్షిణ మధ్య రైల్వే**

**నిరంతర తనిఖీలకు జీఎం సంజయ్ కుమార్ ఆదేశాలు**

**కర్నూలు, సెప్టెంబర్ 28 (స్పంద న్యూస్):** కర్నూలు సిటీ రైల్వే స్టేషన్‌తో పాటు రైల్వే కాలనీలలో సరఫరా చేస్తున్న తాగునీటి నాణ్యతపై దక్షిణ మధ్య రైల్వే పటిష్ఠ పర్యవేక్షణ కొనసాగిస్తోంది. సెప్టెంబర్ 1 వ తేదీ నుంచి 26 వ తేదీ వరకు సేకరించిన మొత్తం 1,917 నీటి నమూనాలను పరీక్షించగా.. అన్నీ తాగడానికి అనుకూలంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. అవశేష క్లోరిన్ స్థాయిల కోసం ఈ 1,917 నమూనాలను పరీక్షించగా అన్నీ సంతృప్తికరంగా ఉన్నాయని పేర్కొన్నారు. మరో 315 నమూనాలకు బ్యాక్టీరియాలజికల్ పరీక్షలు నిర్వహించగా.. ఏ ఒక్క నమూనాలోనూ 'ఈ కోలి' (జు.ఎశీశ్రీఱ) బ్యాక్టీరియా కలుషితం కాలేదని గుర్తించామన్నారు. రసాయన విశ్లేషణకు పంపిన 17 నమూనాలు కూడా తాగడానికి అనుకూలంగా ఉన్నట్లు నిర్ధారణ అయింది. తాగునీటి వనరులు, గ్రౌండ్ లెవల్, హై లెవల్ రిజర్వాయర్ల వద్ద ఇంజినీరింగ్, వైద్య విభాగాలు సంయుక్తంగా 94 తనిఖీలు నిర్వహించాయి. ప్రయాణికులు, రైల్వే సిబ్బంది, నివాసితులకు సురక్షితమైన తాగునీరు అందేలా నిరంతర పరీక్షలు కొనసాగించాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ అధికారులను ఆదేశించారు.

# నేడు నెల్లూరుకు సీఎం చంద్రబాబు!

**మధ్యాహ్నం 2.15 గంటలకు రామాపురం రాక**

**కాకొల్లువారిపల్లిలో కొత్త బీటీ రోడ్డు పరిశీలన**

**కూలీలతో కలిసి శ్రమదానం చేయనున్న ముఖ్యమంత్రి**

**3.05 గంటల నుంచి రామాపురం సభలో పాల్గొననున్న బాబు**

**సాయంత్రం 6.30 గంటలకు తిరిగి ఉండవల్లికి..**

**నెల్లూరు, సెప్టెంబర్ 28 (స్పంద న్యూస్):** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నెల్లూరు జిల్లా పర్యటన ఖరారైంది. ఈ నెల 29 న వరికుంటపాడు మండలంలో ఆయన పర్యటించనున్నారు. మంగళవారం మధ్యాహ్నం 1.15 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి 2.15 గంటలకు వరికుంటపాడు మండలం రామాపురం గ్రామంలోని హెలిప్యాడ్‌కు ముఖ్యమంత్రి చేరుకుంటారు. 2.15 నుంచి 2.30 గంటల వరకు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ఆయనకు ఘనంగా స్వాగతం పలుకుతారు. అనంతరం 2.30 గంటలకు రోడ్డు మార్గంలో బయలుదేరి 2.35 గంటలకు కాకొల్లువారిపల్లి గ్రామానికి చేరుకుంటారు. కాకొల్లువారిపల్లిలో 2.35 నుంచి 3 గంటల వరకు ముఖ్యమంత్రి పర్యటిస్తారు. గ్రామంలో కొత్తగా నిర్మించిన బీటీ రోడ్డుపై నడుస్తూ పనులను పరిశీలిస్తారు. అలాగే కంకర రోడ్డుపై ఉపాధి హామీ పథకం కూలీలతో కలిసి శ్రమదాన కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. మధ్యాహ్నం 3 గంటలకు కాకొల్లువారిపల్లి నుంచి బయలుదేరి 3.05 గంటలకు రామాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమ వేదిక వద్దకు చేరుకుంటారు. 3.05 నుంచి 5.20 గంటల వరకు అక్కడ నిర్వహించే అధికారిక కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి పాల్గొంటారు. సాయంత్రం 5.20 గంటలకు కార్యక్రమ వేదిక నుంచి బయలుదేరి 5.25 గంటలకు రామాపురం హెలిప్యాడ్‌కు సీఎం చేరుకుంటారు. 5.30 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి సాయంత్రం 6.30 గంటలకు ఉండవల్లిలోని తన నివాసానికి చేరుకుంటారు.

# ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం!

(మొదటి పేజీ తరువాయి..)

కల్పించగా, మున్సిపల్ పరిపాలన శాఖ కూడా 800 మందికి పైగా పదోన్నతులు కల్పించేందుకు చర్యలు తీసుకుందని మంత్రి వివరించారు. రికార్డు అసిస్టెంట్ కేడర్లో నియామకమైన ఉద్యోగులందరికీ రూ. 150 కోట్ల భారం పడుతున్నా ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ వర్తింప చేసేందుకు నిర్ణయించామని చెప్పారు. సెలవుల కోసం ప్రత్యేక పోర్టల్ తీసుకువచ్చి 24 గంటల్లోగా మంజూరయ్యేలా చర్యలు చేపట్టామన్నారు. ప్రభుత్వ అనుమతి లేకున్నా ఆదివారం విజయవాడలో 2 వేల మంది ఉద్యోగులు ధర్నాలో పాల్గొనడం సరికాదని మంత్రి పేర్కొన్నారు.

**సీఐ మృతిపై వ్యంగ్య పోస్టులు..**

ధర్నా సమయంలో సీఐ హఠాన్మరణం చెందడం బాధాకరమని, ఆ సంఘటనను సోషల్ మీడియాలో వ్యంగ్యంగా కొంతమంది ఉద్యోగులు పోస్టులు పెట్టడం దురదృష్టకరమని ఖండించారు. స్వర్ణ గ్రామ, వార్డు ఉద్యోగుల ఆందోళనల వెనుక ఎవరున్నారో అర్థం కావడం లేదని, డిమాండ్లను తాము పరిష్కరిస్తుంటే ప్రభుత్వాన్ని నిందించడం సరికాదని పేర్కొన్నారు. సీఐ చనిపోతే చస్తే చావనీలే అంటూ కొందరు ఉద్యోగులు మానవత్వం లేకుండా మాట్లాడటం దారుణమన్నారు. దీనిపై జగన్ ఎందుకు నోరు విప్పడం లేదని, నాడు ఆయన ఎందుకు ప్రమోషన్ ఛానల్ క్రియేట్ చేయలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**జూనియర్ అసిస్టెంట్ కేడర్ కుదరదు..**

ఈ సమావేశంలో ఐటీ కార్యదర్శి కాటమనేని భాస్కర్ మాట్లాడుతూ.. ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ మంజూరైన తర్వాత స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డుల ఉద్యోగులు రికార్డ్ అసిస్టెంట్ కేడర్‌కు సమానంగా నియమించబడినప్పటికీ, వారు జూనియర్ అసిస్టెంట్ స్కేల్ చేరుకున్నందున ఆ కేడర్ కోసం డిమాండ్ చేస్తున్నారని అన్నారు. ఇది నిబంధనలకు విరుద్ధమని, మిగతా శాఖల ఉద్యోగులందరినీ ప్రభావితం చేస్తుందని వివరించారు. ఇతర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే వీరికి కూడా మరణ ప్రయోజనాలు అందిస్తున్నామని, ఇప్పటివరకు 121 మందికి కారుణ్య నియామకాలు కల్పించామని కార్యదర్శి భాస్కర్ తెలిపారు.



# ఆ ఓటమి నాలో కసి పెంచింది!

- **పసుపు కుంకుమలతో పట్టాలు పంపిణీ చేసిన మంత్రి లోకేశ్**
- **2019 లో ఐదు వేల ఓట్లతో ఓడిపోయినా మంగళగిరిని వదల్లేదు**
- **సున్నా చేర్చి 92 వేల మెజారిటీతో గెలిపించిన ప్రజలు**
- **2029 ఎన్నికల నాటికి సమస్యలన్నింటికీ శాశ్వత పరిష్కారం**

**తాడేపల్లి, సెప్టెంబర్ 28 (స్పంద న్యూస్):** 2029 ఎన్నికల నాటికి మంగళగిరిలో ప్రతి గడపకూ తాగునీటి కనెక్షన్, అండర్ గ్రౌండ్ గ్యాస్, భూగర్భ డ్రైనేజీ సౌకర్యం కల్పిస్తామని రాష్ట్ర విద్యా, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. తాడేపల్లి మండలం కుంచనపల్లిలో శనివారం జరిగిన 'మన ఇల్లు ఉ మన లోకేశ్' కార్యక్రమంలో ఆయన 372 మందికి శాశ్వత ఇళ్ల పట్టాలు, పీఎంఏవై మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. సొంత ఇల్లు అనేది ప్రతి ఒక్కరికీ ఒక ఎమోషన్ అని లోకేశ్ అన్నారు. దశాబ్దాలుగా నివాసం ఉంటున్న ఇల్లు రేపు ఉంటుందో



ఊడుతుందో, ఎప్పుడు ఖాళీ చేయిస్తారో అనే భయానికి ఫుల్ స్టాప్ పెడతానని ఎన్నికల్లో హామీ ఇచ్చానని, ఆ మేరకు పసుపు కుంకుమలతో శాశ్వత పట్టాలు పంపిణీ చేస్తున్నానని ఆయన అన్నారు. ఇప్పటిదాకా మూడు విడతల్లో సుమారు 6 వేల మందికి రూ. 2 వేల కోట్ల విలువైన ఆస్తిపై శాశ్వత హక్కులు కల్పించామని గుర్తుచేశారు.

**బాధ్యత పెంచిన మెజారిటీ..**

2019 లో మంగళగిరిని సొంత ఊరుగా భావించి పోటీ చేస్తే కేవలం 5,300 ఓట్ల తేడాతో ఓడిపోయానని.. ఆ ఓటమి తనలో కసి పెంచిందని లోకేశ్ చెప్పారు. ఆ మెజారిటీకి పక్కన ఓ సున్నా చేర్చి గెలిపించాలని తాను అడిగితే.. ప్రజలు ఏకంగా 92 వేల భారీ మెజారిటీతో ఆశీర్వదించారని హర్షం వ్యక్తం చేశారు. ఏపీ చరిత్రలోనే టాప్-3 మెజారిటీ ఇచ్చిన ప్రజల రుణం తీర్చుకునేందుకు, అహర్నిశలు ఈ ప్రాంత అభివృద్ధి గురించే ఆలోచిస్తున్నానన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, పవన్ కల్యాణ్‌తో పోరాడి మరీ నిధులు తెస్తానని చెప్పారు. మంగళగిరిలో 100 పడకల ఆస్పత్రి ప్రజల దశాబ్దాల కల అని, రాష్ట్రంలోనే తొలిసారిగా ఆ ఆస్పత్రి నిర్మాణానికి శ్రీకారం చుట్టామని లోకేశ్ తెలిపారు. వచ్చే ఏడాది తొలి 3 నెలల్లోనే పనులు పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తామని హామీ ఇచ్చారు. మహానాడు కట్టకు రిటైనింగ్ వాల్ పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు గుత్తికొండ ధనుంజయ్, తమ్మిశెట్టి జానకీదేవి, పోతినేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# విజయవాడకు ఉత్సవ శోభ!

- **అక్టోబర్ 11 నుంచి 20 వరకు ఉత్సవ్**
- **దసరా వేళ ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవం**
- **కళలు, పర్యాటకంతో వ్యాపారులకు ఊతం**
- **పున్నమి ఘాట్‌లో జాతీయ సరస్ మేళా**
- **కర్టెన్ రైజర్ వేదికపై మంత్రి కందుల దుర్గేష్**

**విజయవాడ, సెప్టెంబర్ 28 (స్పంద న్యూస్):** విజయవాడ ఉత్సవ్ లాంటి కార్యక్రమాలు నగరానికి సరికొత్త ఉత్సాహాన్ని తీసుకురావడంతో పాటు ప్రజలకు ఆహ్లాదాన్ని పంచుతాయని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ఈ ఉత్సవాలు ఆటో డ్రైవర్లు, చిరువ్యాపారులు సహా పలు వర్గాలకు ఉపాధి కల్పిస్తూ స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఎంతగానో ఊతమిస్తాయన్నారు. నగరంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కళా వేదికలో సోమవారం నిర్వహించిన విజయవాడ ఉత్సవాల కర్టెన్ రైజర్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

**అక్టోబర్ 11 నుంచి ఉత్సవాలు..**

విజయవాడ నగరానికి ఉన్న చారిత్రక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాశస్త్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పే లక్ష్యంతో అక్టోబర్ 11 నుంచి 20 వరకు విజయవాడ ఉత్సవ్ రెండో విడతను ఘనంగా నిర్వహించనున్నట్లు మంత్రి కందుల దుర్గేష్ ప్రకటించారు. నగరానికి పర్యాటక శోభ తెచ్చేలా దసరా వేళ ఈ వేడుకలను తీర్చిదిద్దుతామన్నారు. ఈ ఉత్సవాల నిర్వహణకు చొరవ తీసుకున్న ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), 'సొసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ' నిర్వాహకులను ఆయన ప్రత్యేకంగా




అభినందించారు.

**పున్నమి ఘాట్‌లో సరస్ మేళా..**

వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ.. విజయవాడకు ఘనమైన చారిత్రక, ఆధ్యాత్మిక నేపథ్యం ఉందన్నారు. దసరా శరన్నవరాత్రుల సందర్భంగా కనకదుర్గమ్మ ఆశీస్సులతో పది రోజుల పాటు ప్రజలంతా సోదరభావంతో ఈ ఉత్సవాలను జరుపుకోవాలన్నారు. ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చొరవతో విజయవాడ పున్నమి ఘాట్‌లో తొలిసారిగా ఈ నెల 8 నుంచి 23 వరకు జాతీయ స్థాయి 'సరస్ మేళా' నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బోండా ఉమామహేశ్వరరావు, గద్దె రామ్మోహన్, వెనిగండ్ల రాము, ఎమ్మెల్సీ వర్ల రామయ్య, 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్, రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక సమితి చైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి, రాష్ట్ర నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియా, నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తదితరులు పాల్గొన్నారు.

# గడప వద్దకే పింఛను సొమ్ము!

**యథావిధిగా అక్టోబర్ 1 నుంచే పింఛన్ల పంపిణీ**

**61.80 లక్షల మందికి పండుగలా నగదు అందజేత**

**సెప్టెంబర్ 30 నాటికే పూర్తి నగదు డ్రా**

**గజపతినగరంలో ఖాతాల్లోకే డీబీటీ ద్వారా జమ**

**అధికారులకు మంత్రి కొండపల్లి స్పష్టమైన ఆదేశాలు**

**అమరావతి, సెప్టెంబర్ 28 (స్పంద న్యూస్):** రాష్ట్రంలోని ఎన్టీఆర్ భరోసా పింఛనుదారులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. గతంలో ప్రకటించిన సవరించిన వేళలతో నిమిత్తం లేకుండా, ఎప్పటిలాగే అక్టోబర్ 1 వ తేదీ ఉదయం 6:30 గంటల నుంచే లబ్ధిదారుల ఇంటి వద్దే పింఛన్లను పంపిణీ చేయనున్నట్లు రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

**సమ్మె విరమణతో తొలగిన అడ్డంకులు..**

బ్యాంకు ఉద్యోగులు తమ సమ్మెను విరమించడంతో బ్యాంకింగ్ కార్యకలాపాలకు ఎలాంటి ఆటంకం కలగలేదని మంత్రి పేర్కొన్నారు. దాంతో ముందస్తు ప్రణాళిక ప్రకారమే పింఛన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వివరించారు. సెప్టెంబర్ 30 వ తేదీనే స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సిబ్బంది బ్యాంకుల నుంచి వంద శాతం పింఛను నగదును విత్ డ్రా చేసుకుంటారని, అక్టోబర్ 1 వ తేదీ ఉదయం నుంచే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి నగదు అందజేస్తారని స్పష్టం చేశారు.

**రూ. 2,692 కోట్లు విడుదల..**

అక్టోబర్ నెలకు సంబంధించి ప్రభుత్వం ఇప్పటికే రూ. 2,692.34 కోట్లను విడుదల చేసిందని మంత్రి తెలిపారు. ఇందులో రూ. 2,692.28 కోట్లను పంచాయతీ, వార్డుల ఖాతాలకు జమ చేయగా, రూ. 6 లక్షలను



గజపతినగరం మండలంలోని పింఛనుదారుల ఖాతాలకు డీబీటీ ద్వారా నేరుగా జమ చేస్తారని వివరించారు. ఈ నెల 30 నాటికి అవసరమైన నగదు సిద్ధంగా ఉంచుకోవాలని జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్లు, ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు, బ్యాంకర్లతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. రాష్ట్రంలోని 61.80 లక్షల మంది లబ్ధిదారులకు ప్రతి నెలా 1 వ తేదీనే సకాలంలో పింఛన్లు అందించే బాధ్యతను ప్రజా ప్రభుత్వం తీసుకుందని మంత్రి కొండపల్లి స్పష్టం చేశారు.

ప్రజాపక్షమే
స్పంద
జాతీయ తెలుగు దినపత్రిక





# పల్లెపోరులో పంతాలు!

## 2029 సెమీఫైనల్‌కు పార్టీలు సిద్ధం

గెలుపుకోసం బలప్రయోగ తంత్రాలు

స్థానిక సమరానికి సిద్ధమవుతున్న అధికార, ప్రతిపక్షాలు

- అధికార బలం, సంక్షేమ పథకాలతో కూటమి వ్యూహం
- ప్రతి స్థానంలో పోటీ చేయాల్సిందేనంటున్న జగన్
- గత ఎన్నికల్లో ఏకగ్రీవాలపై వెల్లువెత్తిన వివాదాలు
- అభ్యర్థుల ఉపసంహరణలు, కేసులు, పోలీసుల తీరుపై ఆందోళన
- శాంతిభద్రతలే ఎన్నికల సంఘానికి అసలు పరీక్ష

**ఆంధ్రప్రదేశ్‌లో మరో ఎన్నికల సీజన్‌కు తెరలేవబోతోంది. గ్రామ పంచాయతీలు, మండల,జిల్లా పరిషత్‌లు, పురపాలక సంస్థల ఎన్నికలను వరుసగా నిర్వహించేందుకు ప్రభుత్వ యంత్రాంగం, రాష్ట్ర ఎన్నికల సంఘం సన్నాహాలు చేస్తున్నాయి. వచ్చే ఫిబ్రవరిలోగా మూడు దశల ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలనే యోచన ప్రభుత్వ వర్గాల్లో ఉన్నట్లు ప్రచారం జరుగుతున్నప్పటికీ, అధికారిక షెడ్యూల్ ఇంకా వెలువడాల్సి ఉంది. ఇవి కేవలం సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, కౌన్సిలర్ పదవుల కోసం జరిగే ఎన్నికలు మాత్రమే కావు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన టీడీపీ‌ఉజనసేన‌ఉబీజేపీ కూటమి పాలనకు క్షేత్రస్థాయిలో లభించే తొలి సమగ్ర ప్రజాతీర్పుగా నిలవనున్నాయి. అదే సమయంలో అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం ఎదుర్కొన్న వైసీపీకి రాజకీయంగా తిరిగి నిలబడేందుకు ఇవే తొలి పెద్ద అవకాశం. అందుకే స్థానిక పోరు 2029 సార్వత్రిక ఎన్నికలకు ముందస్తు పరీక్షగా మారనుంది.**

**అమరావతి, సెప్టెంబర్ 28 (స్పంద న్యూస్):** స్థానిక సంస్థల ఎన్నికల్లో సాధారణంగా అధికారంలో ఉన్న పార్టీకే కొంత అనుకూలత ఉంటుంది. గ్రామాలు, పట్టణాల్లో అభివృద్ధి పనులు, రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం, గృహ నిర్మాణం, పింఛన్లు, స్థానిక నిధులు ప్రభుత్వంతో ముడిపడి ఉంటాయి. “మా అభ్యర్థిని గెలిపిస్తేనే నిధులు, అభివృద్ధి వేగంగా వస్తాయి'' అనే ప్రచారం ఓటర్లపై ప్రభావం చూపుతుంది. ప్రస్తుతం గ్రామ, మండల స్థాయిలో అధికార యంత్రాంగంపై కూటమి ప్రభుత్వానికి పట్టు ఉండటం మరో అనుకూల అంశం. ఎమ్మెల్యేలు, మంత్రులు తమ నియోజకవర్గాల్లో స్థానిక నాయకులను సమన్వయం చేయగలిగితే కూటమి స్పష్టమైన ఆధిక్యం సాధించే అవకాశముంది. అయితే అధికార బలమే విజయాన్ని ఖాయం చేయదు. ప్రభుత్వంపై స్థానికంగా ఉన్న అసంతృప్తి, హామీల అమలు, ఇసుకఉమద్యం విధానాలు, రైతుల సమస్యలు, ఉపాధి, ధరల పెరుగుదల వంటి అంశాలు కూడా ఓటింగ్‌ను ప్రభావితం చేయవచ్చు.

### కూటమిలో సీట్ల లెక్కే తొలి పరీక్ష

టీడీపీ, జనసేన, బీజేపీ అసెంబ్లీ ఎన్నికల్లో కూటమిగా విజయాన్ని సాధించాయి. కానీ స్థానిక ఎన్నికల్లో ఆశావహుల సంఖ్య చాలా ఎక్కువగా ఉంటుంది. ఒక గ్రామంలోనో, వార్డులోనో మూడు పార్టీలకు చెందిన నాయకులు టికెట్ కోరే అవకాశం ఉంది. రాష్ట్ర స్థాయిలో పొత్తు సాఫీగా కనిపించినా, క్షేత్రస్థాయిలో సీట్ల సర్దుబాటు కత్తిమీద సామే. టికెట్ దక్కని నాయకులు స్వతంత్రులుగా బరిలోకి దిగితే అధికార కూటమి ఓట్లు చీలవచ్చు. ముఖ్యంగా జనసేన బలంగా ఉన్న ఉభయ గోదావరి జిల్లాలు, బీజేపీకి కొంత పట్టున్న పట్టణ ప్రాంతాలు, టీడీపీకి సంప్రదాయ బలం ఉన్న నియోజకవర్గాల్లో సీట్ల పంపకమే ఎన్నికల ఫలితాలను నిర్ణయించవచ్చు. కూటమి పార్టీల మధ్య ఓట్ల బదిలీ ఎంత సమర్థంగా జరుగుతుందన్నదీ కీలకం.

### 'ప్రతి స్థానంలో పోటీ'.. వైసీపీ కొత్త వ్యూహం

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒక్క స్థానాన్ని కూడా ప్రత్యర్థులకు ఏకగ్రీవంగా వదలవద్దని వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ నేతలకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ప్రతి స్థానంలో అభ్యర్థిని నిలపాలని, పోటీ నుంచి వెనక్కి తగ్గితే రాజకీయంగా అవకాశాలు ఉండవని హెచ్చరించినట్లు వార్తలు వెలువడ్డాయి. అభ్యర్థుల ఎంపిక, నామినేషన్ల దాఖలు, ప్రచారం, పోలింగ్ వరకు సంబంధిత నియోజకవర్గ సమన్వయకర్తలే బాధ్యత తీసుకోవాలని సూచించిన నేపథ్యంలో వైసిపి నేతలు సైతం ప్రతిష్ఠాత్మకంగా తీసుకునే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఈ నిర్ణయంతో గతంలో మాదిరిగా పెద్ద సంఖ్యలో ఏకగ్రీవాలు నమోదయ్యే అవకాశం తగ్గవచ్చు. వైసీపీ ప్రతి గ్రామం, వార్డులో అభ్యర్థిని నిలబెట్టగలిగితే ఎన్నికలు హోరాహోరీగా మారతాయి. అయితే పార్టీ నుంచి అధికార కూటమిలోకి వలసలు, నాయకత్వ లోటు, కేసులు, ఆర్థిక వనరుల కొరతను అధిగమించి అభ్యర్థులను చివరి వరకు పోటీలో నిలబెట్టడం వైసీపీ ముందున్న పెద్ద సవాలు.

### 2021లో తిరుగులేని ఆధిపత్యం సంపాదించిన వైసిపి

2021లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో అప్పటి అధికార వైసీపీ తిరుగులేని ఆధిక్యం సాధించింది. అందుబాటులో ఉన్న ఫలితాల ప్రకారం 652 జడ్పీటీసీ స్థానాల్లో 637, సుమారు 9,700 ఎంపీటీసీ స్థానాల్లో 8,265 స్థానాలను వైసీపీ గెలుచుకుంది. అంటే జడ్పీటీసీల్లో దాదాపు 98 శాతం, ఎంపీటీసీల్లో 85 శాతానికి పైగా స్థానాలను కైవసం చేసుకుంది. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ 12 కార్పొరేషన్లు, 75 మున్సిపాలిటీలుఉనగర పంచాయతీలకు ఎన్నికలు జరగగా వైసీపీ భారీ విజయం నమోదు చేసింది. 2021 పట్టణ స్థానిక ఎన్నికల వివరాలుఅయితే “గత ఎన్నికల్లో 80 శాతం స్థానాలు ఏకగ్రీవమయ్యాయి” అనడం గణాంకపరంగా సరైంది కాదు. వైసీపీ 80 శాతానికి పైగా స్థానాలను గెలుచుకుంది; అన్ని స్థానాలు ఏకగ్రీవం కాలేదు. కొన్ని జిల్లాలు, మున్సిపాలిటీలు, జడ్పీటీసీ స్థానాల్లో మాత్రం పెద్ద సంఖ్యలో ఏకగ్రీవాలు నమోదయ్యాయి. కొన్ని చోట్ల ప్రతిపక్ష అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరించడం, ఉపసంహరింపజేయడం, బెదిరింపులకు పాల్పడటం వంటి ఆరోపణలు వచ్చాయి. మాచర్ల మున్సిపాలిటీ సహా కొన్ని ప్రాంతాల్లో బలవంతపు ఉపసంహరణల ఆరోపణలపై అప్పటి రాష్ట్ర ఎన్నికల సంఘం నివేదికలు కోరిన సందర్భాలున్నాయి. బలవంతపు ఉపసంహరణలపై ఎన్నికల సంఘం స్పందన

### ఏకగ్రీవమా.. ప్రజాస్వామ్య హరణమా?

ఏకగ్రీవ ఎన్నిక తప్పు కాదు. గ్రామాభివృద్ధి కోసం అన్ని వర్గాలు చర్చించి ఒక అభ్యర్థిని ఎన్నుకుంటే అది రాజకీయ పరిపక్వతకు నిదర్శనం. కానీ ప్రత్యర్థిని బెదిరించి, ప్రలోభపెట్టి, నామినేషన్‌ను తిరస్కరింపజేసి లేదా ఉపసంహరించుకునేలా చేసి సాధించే ఏకగ్రీవం ప్రజాస్వామ్యం కాదు. అందువల్ల ఈసారి ఏకగ్రీవాల సంఖ్యకంటే అవి ఏ పరిస్థితుల్లో జరిగాయన్నదే ముఖ్యం. నామినేషన్ల కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు, అభ్యర్థులకు పోలీసు రక్షణ, ఉపసంహరణ ప్రక్రియను వీడియో రికార్డు చేయడం, ఫిర్యాదులపై తక్షణ విచారణ వంటి చర్యలు చేపట్టాలి. అప్పుడే ఎన్నికలపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతుంది.

### పులివెందుల ఉపపోరు ఇచ్చిన సంకేతం

ఇటీవలి పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నిక సందర్భంగా పోలింగ్ కేంద్రాల మార్పు, అధికార యంత్రాంగం వినియోగం, ఓటర్లకు ఇబ్బందులు వంటి అంశాలపై అధికారఉప్రతిపక్షాలు పరస్పరం ఆరోపణలు చేసుకున్నాయి. రాబోయే ఎన్నికల్లో ఇలాంటి వివాదాలు రాష్ట్రవ్యాప్తంగా విస్తరించకుండా ఎన్నికల సంఘం ముందస్తు చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. పులివెందుల ఉప ఎన్నిక వివాదం

### జగన్‌కు జీవన్మరణ పరీక్ష

వైసీపీకి ఈ ఎన్నికలు అత్యంత కీలకం. అసెంబ్లీ ఎన్నికల పరాజయం తరువాత పార్టీ గ్రామస్థాయి నిర్మాణం ఎంతవరకు నిలిచి ఉందో తేలనుంది. ప్రతి స్థానంలో అభ్యర్థిని నిలబెట్టడం ద్వారా కార్యకర్తల్లో ధైర్యం నింపాలని జగన్ భావిస్తున్నారు. గణనీయమైన స్థానాలను గెలిస్తే వైసీపీ పునరుద్ధరణకు పునాది పడుతుంది. భారీ ఓటమి ఎదురైతే వలసలు మరింత పెరిగి, నియోజకవర్గ స్థాయి నాయకత్వం బలహీనపడే ప్రమాదం ఉంది. ప్రతి స్థానంలో పోటీ చేయాలన్న జగన్ ఆదేశం పార్టీ బలాన్ని పెంచవచ్చు. అదే సమయంలో అభ్యర్థులను చివరి వరకు కాపాడుకోవడం, వారికి న్యాయఉఆర్థిక సహాయం అందించడం, పోలింగ్ ఏజెంట్ల వ్యవస్థను ఏర్పాటు చేయడం కూడా అవసరం. కేవలం హెచ్చరికలతో అభ్యర్థులు బరిలో నిలవరు.

### చంద్రబాబుకు పాలనపై ప్రజాతీర్పు

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు స్థానిక ఎన్నికలు పాలనపై మధ్యంతర ప్రజాభిప్రాయంగా మారనున్నాయి. సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు, పెట్టుబడులు, ఉద్యోగాలు, గ్రామీణ రహదారులు, రైతులకు సహాయం వంటి అంశాలను అధికార కూటమి ప్రచారాస్త్రాలుగా ఉపయోగించనుంది. కూటమి ఘనవిజయం సాధిస్తే ప్రభుత్వ విధానాలకు ప్రజామోదం లభించిందని ప్రకటించుకోవచ్చు. ఫలితాలు ప్రతికూలంగా వస్తే హామీల అమలు, స్థానిక నాయకత్వం, ఎమ్మెల్యేల పనితీరుపై అసంతృప్తి ఉందనే సంకేతం వెలువడుతుంది. అందుకే మంత్రులు, ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో అత్యధిక స్థానాలను గెలిపించుకోవాలనే ఒత్తిడిని ఎదుర్కొననున్నారు.

మూడు స్థాయిల్లో మూడు రకాల తీర్పు కనిపిస్తోంది. పంచాయతీల్లో వ్యక్తిగత ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. సర్పంచ్ ఎన్నికలు పార్టీ రహితంగా జరిగినా అభ్యర్థుల వెనుక రాజకీయ పార్టీల మద్దతు స్పష్టంగా ఉంటుంది. కుటుంబ సంబంధాలు, సామాజిక సమీకరణాలు, గ్రామంలో వ్యక్తిగత పలుకుబడి ఫలితాలను నిర్ణయిస్తాయి. పరిషత్‌లలో పార్టీ నిర్మాణం ఉంటుంది. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పార్టీ గుర్తు, ఎమ్మెల్యే ప్రభావం, మండల స్థాయి నాయకత్వం కీలకం. గ్రామీణ ప్రాంతాల్లో ఏ పార్టీకి నిజమైన కేడర్ బలం ఉందో ఈ ఫలితాలు తేలుస్తాయి. మున్సిపాలిటీల్లో పాలనపై తీర్పుపట్టణాల్లో రహదారులు, కాలువలు, చెత్త సేకరణ, తాగునీరు, ఆస్తిపన్ను, ట్రాఫిక్, ఉపాధి, నిర్మాణ అనుమతులు ప్రధాన ఎన్నికల అంశాలవుతాయి. మధ్యతరగతి ఓటర్లు ప్రభుత్వ పనితీరుతోపాటు స్థానిక అభ్యర్థుల సామర్థ్యాన్నీ పరిశీలిస్తారు.

### తుది పోరు టీడీపీఉవైసీపీ మధ్యే!

రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన పోరు టీడీపీ నేతృత్వంలోని కూటమి, వైసీపీ మధ్యే కేంద్రీకృతమయ్యే అవకాశం ఉంది. జనసేన, బీజేపీ కూటమిలో తమ వాటాను పెంచుకోవాలని చూస్తాయి. కాంగ్రెస్, వామపక్షాలు కొన్ని ప్రాంతాల్లో ప్రభావం చూపగలిగినా, రాష్ట్రవ్యాప్త ఫలితాలను నిర్ణయించే స్థాయిలో వాటి సంస్థాగత బలం ప్రస్తుతం పరిమితంగానే ఉంది. అధికార కూటమికి ప్రభుత్వం, ఎమ్మెల్యేల బలం, వనరులు అనుకూలిస్తేవైసీపీకి గత ఐదేళ్లలో నిర్మించుకున్న గ్రామస్థాయి నాయకత్వం, సంక్షేమ లబ్ధిదారుల మద్దతు ఆశగా నిలవవచ్చు. పోరు ఏకపక్షంగా మారుతుందా, ప్రతిపక్షం గట్టి సవాల్ విసురుతుందా అనేది అభ్యర్థుల ఎంపిక, ఎన్నికల నిర్వహణ నిష్పాక్షికతపై ఆధారపడి ఉంటుంది.

### ఎన్నికల సంఘానిదే కీలక బాధ్యత

రాష్ట్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాలు, రిజర్వేషన్లు, పోలింగ్ సామగ్రి, సిబ్బంది ఏర్పాట్లపై కసరత్తు చేస్తోంది. గత ఎన్నికల్లో వచ్చిన ఫిర్యాదుల దృష్ట్యా ఈసారి నామినేషన్ల దశ నుంచే ప్రత్యేక పర్యవేక్షణ అవసరం. రాష్ట్రవ్యాప్తంగా స్థానిక ఎన్నికల నిర్వహణ కోసం 1.2 లక్షల బ్యాలెట్ బాక్సులు అందుబాటులో ఉండగా, అదనపు బాక్సుల సమీకరణపై అధికారులు దృష్టి పెట్టినట్లు సమాచారం. ఇదిఇలావుండగా,స్థానిక సంస్థలను గెలుచుకోవడం అంటే కేవలం పదవులు దక్కించుకోవడం కాదు. గ్రామం నుంచి జిల్లా వరకు రాజకీయ వ్యవస్థపై పట్టు సాధించడం. అందుకే అధికార కూటమి తన ఆధిపత్యాన్ని స్థిరపరచుకోవాలని చూస్తుంటే, వైసీపీ తన ఉనికిని నిరూపించుకునేందుకు సర్వశక్తులు ఒడ్డుతోంది. పోటీ ప్రజాస్వామ్యబద్ధంగా జరిగితే ప్రజలే విజేతలు. బెదిరింపులు, బలవంతపు ఉపసంహరణలు, కేసులు, ఘర్షణలు కేంద్రంగా మారితే మాత్రం గెలిచేది పార్టీ కావచ్చుఉఓడిపోయేది ప్రజాస్వామ్యమే!

### నాడు వైసీపీపై ఆరోపణలు.. నేడు కూటమిపై అనుమానాలు

2021లో అధికారంలో ఉన్న వైసీపీపై టీడీపీ తీవ్ర ఆరోపణలు చేసింది. ప్రతిపక్ష అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని, వేసిన నామినేషన్లను ఉపసంహరించుకునేలా ఒత్తిడి చేశారని, పోలీసుఉఅధికార యంత్రాంగాన్ని దుర్వినియోగం చేశారని విమర్శించింది. ఇప్పుడు రాజకీయ పాత్రలు మారాయి. టీడీపీ నేతృత్వంలోని కూటమి అధికారంలో ఉండగా వైసీపీ ప్రతిపక్షంలో ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలో కేసులు, అరెస్టులు, నాయకుల మధ్య ఘర్షణలు, కార్యాలయాలుఉఆస్తులపై వివాదాలు రాజకీయ వాతావరణాన్ని వేడెక్కిస్తున్నాయి. పోలీసులు అధికార పక్షానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్నది వైసీపీ ఆరోపణ. వైసీపీ హయాంలో జరిగిన అక్రమాలపై చట్టప్రకారమే చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వం చెబుతోంది. ఈ పరస్పర ఆరోపణల నేపథ్యంలో స్థానిక ఎన్నికల్లో నామినేషన్ల దశ నుంచే ఉద్రిక్తతలు తలెత్తే అవకాశం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ముఖ్యంగా ఫ్యాక్షన్ ప్రభావిత ప్రాంతాలు, రాజకీయంగా సున్నితమైన పల్నాడు, రాయలసీమ జిల్లాలు, ఉభయ గోదావరి జిల్లాల్లోని కొన్ని నియోజకవర్గాలపై ప్రత్యేక నిఘా అవసరం.

---

# రాష్ట్రం కష్టాల్లో.. సీఎం అజ్ఞాతంలో!

- వరదలు, కరువుతో అల్లాడుతున్న ప్రజలు
- ఇన్ని సమస్యలు వదిలేసి ముఖ్యమంత్రి ఎక్కడికి వెళ్లారు?: లక్ష్మీపార్వతి

**తాడేపల్లి, సెప్టెంబర్ 28 (స్పంద న్యూస్):** రాష్ట్రంలో వరదలు, కరువు, నిరసనలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మూడు రోజులుగా కనిపించకుండా ఎక్కడికి వెళ్లారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందమూరి లక్ష్మీపార్వతి ప్రశ్నించారు. శనివారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి ఎక్కడికి వెళ్లారు, ఆ పర్యటన వివరాలను ఎందుకు రహస్యంగా ఉంచుతున్నారో వెల్లడించాలని డిమాండ్ చేశారు.



### రాష్ట్రం కష్టాల్లో ఉంటే పట్టించుకోరా..

ఉత్తరాంధ్ర వరదలతో అతలాకుతలమవుతుం డగా, రాయలసీమలో రైతులు కరువుతో ఇబ్బందులు పడుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగ యువత ఆందోళనలు చేస్తున్నారని, డీఎస్సీ అభ్యర్థులు న్యాయం కోసం రోడ్డెక్కారని గుర్తుచేశారు. రాష్ట్రం ఇన్ని సమస్యలతో సతమతమవుతున్న సమయంలో ముఖ్యమంత్రి అదృశ్యం కావడం దారుణమన్నారు. గతంలో కూడా చంద్రబాబు కుటుంబ పర్యటనల పేరుతో వివరాలు వెల్లడించని విదేశీ పర్యటనలు చేశారని ఆరోపించారు. అవినీతి ద్వారా సంపాదించిన డబ్బును తరలించేందుకు, దాచేందుకే ఈ పర్యటనలు చేస్తున్నారని విమర్శించారు. ఇలాంటి పర్యటనలపై కేంద్ర ప్రభుత్వం, నిఘా సంస్థలు ఎందుకు దృష్టి సారించడం లేదని ప్రశ్నించారు.

### వాళ్లంతా ఇప్పుడు ఎందుకు మాట్లాడరు?

వైఎస్ జగన్ విదేశాలకు వెళ్లేటప్పుడు తన ప్రయాణ వివరాలను వెల్లడించడంతో పాటు అవసరమైన సందర్భాల్లో కోర్టు అనుమతి కూడా తీసుకున్నారని లక్ష్మీపార్వతి గుర్తుచేశారు. నాడు జగన్‌పై విమర్శలు చేసిన నారా లోకేశ్, ఎల్లో మీడియా చంద్రబాబు ప్రస్తుత ఆచూకీపై ఎందుకు మౌనం వహిస్తున్నారని ఆమె నిలదీశారు.

### రూ. పదిహేను లక్షలకు డీఎస్సీ పోస్టులు..

కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న రెడ్ బుక్ విధానం, అవినీతి, లంచాల డిమాండ్ల కారణంగా రాష్ట్రం నుంచి పెట్టుబడులు, పరిశ్రమలు వెళ్లిపోతున్నాయని లక్ష్మీపార్వతి ఆరోపించారు. ఇసుక, కొండలతో సహా సహజ వనరులు దోపిడీకి గురవుతున్నాయని విమర్శించారు. డీఎస్సీ నియామకాల్లో అవకతవకలకు పాల్పడుతూ.. ఒక్కో ఉద్యోగాన్ని పదిహేను లక్షలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. వైఎస్ జగన్ హయాంలో సంక్షేమం, విద్య, వైద్య రంగాల్లో అభివృద్ధి జరిగిందని.. ప్రస్తుత ప్రభుత్వం రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, నిరుద్యోగ యువతను తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టిందని ఆమె విమర్శించారు.

---

# రైతుకు కన్నీరు.. ఉద్యోగికి లాఠీచార్జి!

- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ బొత్స సత్యనారాయణ
- సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి
- సచివాలయ వ్యవస్థను తెచ్చింది మేమే..
- కళింగపట్నం తుపానుతో భారీగా పంట నష్టం
- నామమాత్రపు సాయం కాదు.. పూర్తి పరిహారం ఇవ్వాలి



**విజయనగరం, సెప్టెంబర్ 28 (స్పంద న్యూస్):** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉద్యోగులను అణచివేస్తూ.. రైతులను విస్మరిస్తోందని శాసన మండలి ప్రతిపక్ష నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేస్తూ, యువతకు పారదర్శకంగా ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టిందని ఆయన గుర్తుచేశారు. ఆనాడు మున్సిపల్ శాఖ మంత్రిగా ఆ నియామకాలను తానే పర్యవేక్షించానని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వానికి ఉద్యోగులతో కూర్చొని వారి సమస్యలను పరిష్కరించే సమయం, ఉద్దేశం లేదని విమర్శించారు. తమ డిమాండ్ల పరిష్కారం కోసం శాంతియుతంగా ఆందోళన చేస్తున్న సచివాలయ ఉద్యోగులపై పోలీసుల చర్యలను బొత్స తీవ్రంగా ఖండించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇచ్చిన ‘చలో విజయవాడ‘ పిలుపునకు స్పందించిన సుమారు మూడు వేల మంది ఉద్యోగులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారన్నారు. విజయవాడలో 140 మంది ఉద్యోగ సంఘాల నేతలను అరెస్టు చేసి వేధింపులకు గురిచేశారని ఆరోపించారు. మహిళా ఉద్యోగులపైనా పోలీసుల జులుం తగదన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును అణచివేయడం నియంతృత్వ పాలనకు నిదర్శనమని ధ్వజమెత్తారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

### రైతులకు పరిహారం ఏదీ?

కళింగపట్నం సమీపంలో తుపాను తీరం దాటిన కారణంగా తూర్పు తీర ప్రాంతంలో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని బొత్స ఆవేదన వ్యక్తం చేశారు. అరటి, బొప్పాయి, మొక్కజొన్న, వరి పంటలకు భారీ నష్టం వాటిల్లిందన్నారు. తిత్లీ తుపాను నష్టాలకు సంబంధించిన పరిహారం కోసం రైతులు ఇప్పటికీ ఎదురుచూస్తున్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పంటల బీమా ప్రీమియంను ప్రభుత్వమే చెల్లించడంతో పాటు విపత్తులు సంభవించిన రెండు నెలల్లోనే రైతులకు పరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ అందించామని గుర్తుచేశారు. నష్టపోయిన ఒక్క రైతుకైనా కూటమి సర్కార్ పరిహారం చెల్లించిందా అని ప్రశ్నించారు. అరటి, బొప్పాయి రైతులు ఎకరాకు లక్ష రూపాయలు, మొక్కజొన్న రైతులు యాభై వేల రూపాయల వరకు పెట్టుబడి పెట్టి నష్టపోయారని.. నామమాత్రపు సాయం కాకుండా వాస్తవ నష్టాల ఆధారంగా పూర్తి పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

---

# పేదలకు గుండె భరోసా!

### మంత్రి సత్యకుమార్

**అమరావతి, సెప్టెంబర్ 28 (స్పంద న్యూస్):** ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో గుండె సంబంధిత వైద్య సేవలను మరింత విస్తరించి, పేదలకు నాణ్యమైన వైద్యం అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. గుండె జబ్బులకు వైద్యం కోసం పేదలు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా ఈ వివరాలను మంత్రి వెల్లడించారు. గుండె వైద్య నిపుణుల అందుబాటును పెంచేందుకు వైద్య పీజీ కోర్సుల్లో కొత్తగా 16 సీట్లు అందుబాటులోకి వచ్చాయని మంత్రి తెలిపారు. కాకినాడ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన ఆధునిక క్యాథ్‌ల్యాబ్ పనులు, ఒప్పందం పూర్తయ్యాయని.. అక్టోబర్ 1 న సేవలు ప్రారంభించనున్నామని వెల్లడించారు. తిరుపతి, నెల్లూరు, శ్రీకాకుళం ఆసుపత్రుల్లో రూ. 18 కోట్లతో కొత్త క్యాథ్‌ల్యాబ్‌ల ఏర్పాటుకు టెండర్ ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో 5, పీపీపీ విధానంలో 3 క్యాథ్‌ల్యాబ్‌లు పనిచేస్తున్నాయని మంత్రి సత్యకుమార్ వివరించారు. ప్రతి ఏటా సెప్టెంబరు 29 న ప్రపంచ హృదయ దినోత్సవాన్ని నిర్వహిస్తారని, 2026 లో ‘డోంట్ మిస్ ఏ బీట్‘ అనే నినాదంతో అవగాహన కల్పిస్తున్నారని మంత్రి తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఏటా సుమారు 2 కోట్ల మంది గుండె జబ్బులతో మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భారత్‌లో ప్రతి 4 మరణాల్లో ఒక మరణానికి గుండె జబ్బులే కారణమవుతున్నాయని చెప్పారు.

ప్రజాగళమే
స్పంద
జాతీయ తెలుగు దినపత్రిక
మంగళవారం, 29 సెప్టెంబర్ 2026



# కేసు మూసేందుకు రూ.2 కోట్ల లంచం!

**ఏసీబీ ఉచ్చులో ఎస్ఓజీ అదనపు ఎస్పీ ముఖేష్ కుమార్ సోనీ**

**క్లోజర్ రిపోర్టు, స్వాధీనం చేసుకున్న వస్తువుల విడుదలకు భారీ డిమాండ్**

**జైపూర్, సెప్టెంబర్ 28 (స్పంద న్యూస్):** కేసును మూసివేసేందుకు ఏకంగా రూ. 2 కోట్లు లంచం డిమాండ్ చేశారన్న ఆరోపణలతో రాజస్థాన్ స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్‌కు చెందిన అదనపు ఎస్పీ ముఖేష్ కుమార్ సోనీని అవినీతి నిరోధక శాఖ అధికారులు అరెస్ట్ చేశారు. ఉదయపూర్ మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించిన 272 ప్లాట్ల వ్యవహారంలో క్లోజర్ రిపోర్టు దాఖలు చేయడంతో పాటు దర్యాప్తులో స్వాధీనం చేసుకున్న వస్తువులను విడుదల చేసేందుకు ఈ భారీ మొత్తాన్ని డిమాండ్ చేసినట్లు ఏసీబీ ఆరోపిస్తోంది. ఈ వ్యవహారంలో సజ్జన్ కుమార్ అనే వ్యక్తి మధ్యవర్తిగా వ్యవహరించినట్లు ఏసీబీ గుర్తించింది. లంచం మొత్తాన్ని అతడు స్వీకరిస్తున్న సమయంలో అధికారులు ట్రాప్ చేసి పట్టుకున్నట్లు సమాచారం. అనంతరం బలోత్రా జిల్లాలోని నివాసంలో ముఖేష్ కుమార్ సోనీని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. అవినీతి నిరోధక చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపర్చగా మూడు రోజుల ఏసీబీ కస్టడీకి అప్పగించినట్లు సమాచారం. ముఖేష్ కుమార్ సోనీపై గతంలో వచ్చిన ఆరోపణలు కూడా తాజా అరెస్టుతో మరోసారి చర్చకు వచ్చాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 4న జైపూర్‌లో రైలు ముందు దూకి ఆత్మహత్య చేసుకున్న 35 ఏళ్ల లెక్చరర్ మనోహర్‌లాల్ తన సూసైడ్ నోట్‌లో పోలీసు వ్యవస్థతో పాటు ముఖేష్ కుమార్ సోనీపై ఆరోపణలు చేసినట్లు అప్పట్లో వార్తలు వెలువడ్డాయి. ఆ ఆరోపణల నేపథ్యంలో విచారణకు ఆదేశించినట్లు సమాచారం. అయితే సూసైడ్ నోట్‌లో చేసిన ఆరోపణలు నిర్ధారిత నేరంగా పరిగణించలేము. అజ్మీర్‌లో మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు సంబంధించిన కేసులను లంచాలు తీసుకుని బలహీనపరిచారనే ఆరోపణలు కూడా ముఖేష్ కుమార్ సోనీపై గతంలో వచ్చినట్లు కథనాలు పేర్కొన్నాయి. వాటిపైనా తుది న్యాయ నిర్ధారణ జరిగినట్లు స్పష్టమైన సమాచారం లేదు. తాజా రూ. 2 కోట్ల లంచం కేసులో మాత్రం ఏసీబీ దర్యాప్తు కొనసాగుతోంది.

## ట్రాఫిక్ జరిమానాలు చెల్లించకపోతే..

# విద్యుత్ బిల్లులకు కలపండి: సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28 (స్పంద న్యూస్):** దేశ వ్యాప్తంగా పేరుకుపోతున్న ట్రాఫిక్ జరిమానాలకు సంబంధించిన చలాన్లపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ట్రాఫిక్ జరిమానాలను చెల్లించని పక్షంలో విద్యుత్ బిల్లులకు చలాన్ల మొత్తం జతచేయాలని సూచించింది. అలాగే జరిమానాలు వసూలు చేసేందుకు ఇతర మార్గాలను కూడా అధికారులు పరిశీలించాలని పేర్కొంది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో సుమారు రూ. 45,000 కోట్ల విలువైన ఈ-చలాన్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. అందులో ఇప్పటి వరకు సుమారు రూ. 25,000 కోట్లు వసూలు అయ్యాయి. కాగా, ఇంకా సుమారు రూ. 20,000 కోట్లకు పైగా ఈ-చలాన్ బకాయిలు పెండింగ్‌లో ఉండటంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. చలాన్ల మొత్తాన్ని వసూలు చేయడానికి అధికారులు క్షేత్రస్థాయిలో కచ్చితమైన చర్యలు తీసుకోవాలని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. చలాన్ల కేసు విచారణ సందర్భంగా న్యాయమూర్తి జేబీ పార్దీవాలా కీలక సూచనలు చేశారు. 'ప్రజలు ట్రాఫిక్ చలాన్లు చెల్లించకపోతే, ఆ మొత్తాన్ని వారి విద్యుత్ బకాయిల బిల్లుకు జతచేయండి. వారు విద్యుత్ బిల్లు చెల్లించాల్సిందే, లేకపోతే విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు. దీనికి ఒక పరిష్కారాన్ని కనుగొనండి. ఈ దేశంలో ఏదో ఒక మార్గాన్ని మీరు వెతకాల్సిందే' అని అన్నారు. అలాగే చలాన్‌లు పెండింగ్‌లో ఉండే వాహనాల రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ల పునరుద్ధరణ నిలిపివేయడం వంటి చర్యలను పరిశీలించవచ్చని సుప్రీంకోర్టు పేర్కొంది. ఆ వాహనాల యాజమాన్య బదిలీని నిరోధించడం, చలాన్‌లు క్లియర్ అయ్యేంత వరకు వాహన ఫిట్‌నెస్ సర్టిఫికేట్ జారీ చేయకపోవడం, అలాంటి వాహనాలను పరివాహన్ పోర్టల్‌లో బ్లాక్‌లిస్ట్ చేయడం, డ్రైవింగ్ లైసెన్సుల పునరుద్ధరణను నిలిపివేయడం వంటి అంశాలను కూడా పరిగణించాలని సూచించింది. మరోవైపు ఇప్పటికే జారీ చేసిన డ్రైవింగ్ లైసెన్సులను సస్పెండ్ చేయడం, చెల్లించని చలాన్‌లు ఉన్న వాహనాలకు పీయూసీ సర్టిఫికేట్లు జారీ చేయడానికి నిరాకరించడం వంటి ఇతర చర్యలను కూడా సుప్రీంకోర్టు చర్చించింది. వాహనాలను యాదృచ్ఛికంగా తనిఖీ చేయాలని, చెల్లించని ఈ-చలాన్ ఉన్నట్లయితే, అవసరమైతే అధికారులు దానిని స్వాధీనం చేసుకోవచ్చని కూడా కోర్టు పేర్కొంది. దేశంలో ఈ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేయాలంటే, క్షేత్రస్థాయి వాస్తవాలను పరిగణనలోకి తీసుకునే పరిష్కారాలను అధికారులు అన్వేషించాలని జస్టిస్ పర్దీవాలా అన్నారు. అయితే చెల్లించని ట్రాఫిక్ చలాన్‌లను విద్యుత్ బిల్లులకు కలపాలన్న ఆలోచన కేవలం ఒక సూచన మాత్రమేనని, అమలు చేయడానికి ఆదేశం కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.




# ఉజ్జయినిలో ఉద్రిక్తత

**షాహి మసీదు భాగం తొలగింపుపై నిరసన.. పోలీసులతో ఘర్షణ**

**పోలీసులపై రాళ్ల వర్షం**

- రాళ్ల దాడితో పరిస్థితి ఉద్రిక్తం.. బాష్పవాయువు ప్రయోగం
- రంగంలోకి ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్.. భారీగా బలగాల మోహరింపు
- సింహస్థ-2028 కోసం రోడ్డు విస్తరణలో భాగంగా నిర్మాణాల తొలగింపు
- 15 మంది అదుపులోకి.. ఏడుగురిపై కేసులు నమోదు



**ఉజ్జయిని, సెప్టెంబర్ 28 (స్పంద న్యూస్):** మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో సోమవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సింహస్థ-2028 ఏర్పాట్లలో భాగంగా చేపట్టిన రోడ్డు విస్తరణకు అడ్డుగా ఉన్న షాహి మసీదులోని కొంత భాగాన్ని తొలగించే ప్రక్రియ సందర్భంగా నిరసనకారులు, పోలీసుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. కొందరు పోలీసులపై రాళ్లు రువ్వడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. జనాన్ని చెదరగొట్టేందుకు పోలీసులు బాష్పవాయువు ప్రయోగించారు. ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌ను కూడా రంగంలోకి దించారు. షాహి మసీదులో రోడ్డు విస్తరణ పరిధిలోకి వస్తున్న భాగాన్ని తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ ఆదివారం రాత్రి నుంచే పలువురు అక్కడ గుమికూడారు. రాత్రి జరిగిన చర్చల్లో మసీదు కమిటీ, అధికార యంత్రాంగం మధ్య ప్రభావిత భాగాన్ని తొలగించే అంశంపై అవగాహన కుదిరినట్లు అధికారులు తెలిపారు. సోమవారం ఉదయం మరోసారి పెద్ద సంఖ్యలో జనం చేరడంతో పరిస్థితి మారిపోయింది. ఈ క్రమంలో కొందరు పోలీసులపై రాళ్లు రువ్వగా, పోలీసులు బాష్పవాయువు ప్రయోగించి జనాన్ని చెదరగొట్టారు. అనంతరం పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఘటన అనంతరం 15 మందిని పోలీసులు అదుపులోకి తీసుకోగా, ఏడుగురిపై కేసులు నమోదు చేసినట్లు వార్తా కథనాలు వెల్లడించాయి. ముందు జాగ్రత్తగా షాహి మసీదు పరిసరాల్లో భారీగా పోలీసు బలగాలను కొనసాగిస్తున్నారు. 2028లో జరిగే సింహస్థ కుంభమేళా నేపథ్యంలో ఉజ్జయినిలో మౌలిక వసతుల విస్తరణ పనులు చేపట్టారు. ఇందులో భాగంగానే షాహి మసీదు వద్ద రహదారిని విస్తరించే ప్రాజెక్టును అమలు చేస్తున్నారు. ఈ రోడ్డు విస్తరణ పరిధిలో మొత్తం 272 నిర్మాణాలను గుర్తించినట్లు సమాచారం. ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ. 9.8 కోట్లు కేటాయించినట్లు వార్తా కథనాలు పేర్కొన్నాయి. మసీదు భాగం తొలగింపుపై న్యాయపరమైన వివాదం కూడా కొనసాగింది. అయితే మసీదు నిర్వాహకులు, పౌర అధికారుల మధ్య రోడ్డు విస్తరణకు సంబంధించి అంగీకారం కుదరడంతో మధ్యప్రదేశ్ హైకోర్టు ఆ వ్యవహారాన్ని ముగించినట్లు తాజా సమాచారం వెల్లడించింది.

# ప్రశ్నిస్తే చెంపదెబ్బ.. అడిగితే లాఠీచార్జ్

- ఢిల్లీ మంత్రి పర్వేశ్ వర్మ ఘటనపై రాహుల్ గాంధీ మండిపాటు
- రోడ్డుపై ప్రశ్నిస్తే చెంపదెబ్బ.. పేపర్ లీకులపై నిలదీస్తే లాఠీచార్జ్ అంటూ విమర్శ
- పార్లమెంట్‌లో ప్రశ్నిస్తే మైక్ ఆపేస్తున్నారని ఆరోపణ
- 'ఓటు చోరీ' ఆరోపణలనూ ఘటనతో ముడిపెట్టిన లోక్‌సభ ప్రతిపక్ష నేత
- తన కుటుంబాన్ని దూషించడంతోనే ఆవేశంలో స్పందించానన్న పర్వేశ్ వర్మ







**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28 (స్పంద న్యూస్):** ఢిల్లీ ప్రజాపనుల శాఖ మంత్రి పర్వేశ్ వర్మ ఓ యువకుడిని చెంపదెబ్బ కొట్టిన ఘటన రాజకీయ దుమారం రేపుతోంది. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. "రోడ్డుపై ప్రశ్నిస్తే చెంపదెబ్బ.. పేపర్ లీకులపై ప్రశ్నిస్తే లాఠీచార్జ్.. పార్లమెంట్‌లో ప్రశ్నిస్తే మైక్ ఆపేస్తారు" అంటూ కేంద్రంలోని బీజేపీతో పాటు ఢిల్లీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.

**'ఓటర్లంటే భయం లేకుండా పోయింది'**

పశ్చిమ ఢిల్లీలో రోడ్డు పనులను పరిశీలిస్తున్న సమయంలో పర్వేశ్ వర్మ, ఆప్ ఎమ్మెల్యే జర్నైల్ సింగ్ మధ్య రోడ్డు నాణ్యతపై వాగ్వాదం చోటుచేసుకుంది. ఆ సమయంలో ఘటనను సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తున్న సాహిబ్ సింగ్ ఫోన్‌ను పర్వేశ్ వర్మ కిందకు నెట్టి, అనంతరం అతడి చెంపపై కొట్టినట్లు వీడియోలో కనిపించింది. సాహిబ్ సింగ్ ఆప్ ఎమ్మెల్యే సామాజిక మాధ్యమ బృందంతో పనిచేస్తున్నట్లు వార్తా కథనాలు పేర్కొన్నాయి. ఈ వీడియోపై స్పందించిన రాహుల్ గాంధీ.. అధికారంలో ఉన్నవారికి ఓటర్లంటే భయం లేకుండా పోయిందని ఆరోపించారు. తాను చేస్తున్న 'ఓటు చోరీ' ఆరోపణలను కూడా ఈ ఘటనతో ముడిపెడుతూ, ఎన్నికల్లో ఓటమి భయం లేకపోవడం వల్లే ఇలాంటి అహంకారపూరిత వైఖరి కనిపిస్తోందని విమర్శించారు. అయితే 'ఓటు చోరీ' అనేది రాహుల్ చేస్తున్న రాజకీయ ఆరోపణే తప్ప, ఈ ఘటనకు కారణమని నిర్ధారితమైన అంశం కాదు.

**'కుటుంబాన్ని దూషించడంతోనే..'**

మరోవైపు పర్వేశ్ వర్మ ఈ ఘటనపై భిన్నమైన వివరణ ఇచ్చారు. ఆప్ కార్యకర్తలు తన కుటుంబ సభ్యులను దూషించారని, ఆ సమయంలో ఆవేశంలో స్పందించానని చెప్పారు. వైరల్ అవుతున్న వీడియోలో పూర్తి ఘటన లేదని పేర్కొన్నారు. ఈ ఆరోపణను ఆప్ ఎమ్మెల్యే జర్నైల్ సింగ్ ఖండించారు. ఘటనకు సంబంధించి సాహిబ్ సింగ్‌తో పాటు ఇరువర్గాల నుంచి ఢిల్లీ పోలీసులకు మొత్తం ఐదు ఫిర్యాదులు అందగా, సోమవారం నాటికి ఎఫ్ఐఆర్ నమోదు కాలేదని పోలీసులు వెల్లడించారు.

# 18 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియా ఖాతాలు వద్దు

- మైనర్లతో ఒప్పందాలు చట్టబద్ధం కావు
- సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం
- సోషల్ మీడియా వాడకంపై చట్టబద్ధ నిబంధనలు తెచ్చేలా కేంద్రానికి ఆదేశాలు



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28 (స్పంద న్యూస్):** 18 ఏళ్లలోపు ఉన్న పిల్లలు సోషల్ మీడియా ఖాతాలను స్వతంత్రంగా తెరవడం, వాటిని ఉపయోగించడంపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ కీలక వ్యాఖ్యలు చేసింది. మైనర్లకు చట్టపరంగా ఒప్పందాలు (కాంట్రాక్టులు) చేసుకునే సామర్థ్యం లేనప్పుడు, సోషల్ మీడియా ఖాతాలు తెరిచే సమయంలో ఆయా ప్లాట్‌ఫామ్‌లు విధించే నిబంధనలు, షరతులను వారు అంగీకరించడం చట్ట ప్రకారం ఎలా సాధ్యమవుతుందని కోర్టు ప్రశ్నించింది. ఈ తీవ్ర అంశంపై 18 ఏళ్ల వయోపరిమితిని కఠినంగా అమలు చేసేలా స్పష్టమైన చట్టబద్ధ నిబంధనలు రూపొందించవచ్చా అనే కోణంలో సమగ్రంగా పరిశీలించాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ అంశంపై కీలక విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా ధర్మాసనంలోని న్యాయమూర్తి జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ స్పందిస్తూ.. ఏదైనా సోషల్ మీడియా ఖాతా తెరవాలంటే వినియోగదారులు సదరు ప్లాట్‌ఫామ్ నిబంధనలు, షరతులను తప్పనిసరిగా అంగీకరించాల్సి ఉంటుందని గుర్తుచేశారు. అయితే భారత ఒప్పందాల చట్టం (ఇండియన్ కాంట్రాక్ట్ యాక్ట్) లోని సెక్షన్ 11 ప్రకారం మైనర్లకు ఎలాంటి చట్టబద్ధ ఒప్పందం చేసుకునే అర్హత ఉండదని, చట్టప్రకారం మైనర్‌తో చేసుకున్న ఒప్పందం ప్రారంభం నుంచే చెల్లుబాటు కాదని ధర్మాసనం స్పష్టం చేసింది.

**కేంద్ర ప్రభుత్వానికి సూచనలు**

మైనర్లు స్వతంత్రంగా సోషల్ మీడియా ఖాతాలను తెరవకుండా నిరోధించేందుకు తగిన చట్టబద్ధమైన నిబంధనలు తీసుకురావచ్చా అనే అంశాన్ని నిశితంగా పరిశీలించాలని కేంద్రానికి అత్యున్నత న్యాయస్థానం సూచించింది. 18 ఏళ్లలోపు పిల్లలు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లను ఉపయోగించడంపై పూర్తిగా నిషేధం విధించాలా? లేదా ఒక నిర్దిష్ట వయసు వరకు తల్లిదండ్రులు, సంరక్షకుల అనుమతి మరియు పర్యవేక్షణ ఉండేలా కఠిన నిబంధనలు తీసుకురావాలా? అనే అంశాలపై సమగ్ర విధానాన్ని ఖరారు చేయాలని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది.

# రోడ్డు తనిఖీలో చెంపదెబ్బ వివాదం

**ఢిల్లీ మంత్రి పర్వేష్ వర్మపై ఎన్సీఆర్ నమోదు!**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28 (స్పంద న్యూస్):** పశ్చిమ ఢిల్లీలోని తిలక్‌నగర్-వికాస్‌పురి ప్రాం తంలో నూతనంగా నిర్మించిన పీడబ్ల్యూడీ రోడ్డు నాణ్యత తనిఖీ కార్యక్రమంలో చెంపదెబ్బ వివాదం తీవ్ర రాజకీయ దుమారానికి దారితీసింది. పరిశీలన సమయంలో ఒక వ్యక్తిపై చేయిచేసుకున్నారనే తీవ్ర ఆరోపణలపై ఢిల్లీ రోడ్లు, భవనాల శాఖ (పీడబ్ల్యూడీ) మంత్రి పర్వేష్ వర్మపై ఢిల్లీ పోలీసులు 'నాన్-కాగ్నిజబుల్ రిపోర్ట్' (ఎన్సీఆర్) నమోదు చేశారు. ఆదివారం జరిగిన ఈ తనిఖీ కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యే జర్నైల్ సింగ్, ఆయన మద్దతుదారులు నూతన రోడ్డు నిర్మాణ నాణ్యతపై నిలదీశారు. ఈ క్రమంలో అక్కడ జరుగుతున్న దృశ్యాలను తన ఫోన్‌లో రికార్డ్ చేస్తున్న సాహిబ్ సింగ్ అనే వ్యక్తి ఫోన్‌ను మంత్రి కిందకు తోసేసి, అతని చెంపపై కొట్టినట్లు ఉన్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మంత్రి కొట్టడమే కాకుండా, ఆయన భద్రతా సిబ్బంది కూ డా తనను తీవ్రంగా బెదిరించారని బాధితుడు సాహిబ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీడియో సోషల్ మీడియాలో కలకలం సృష్టించిన అనంతరం మంత్రి పర్వేష్ వర్మ తీవ్ర ఆరోపణలు చేశారు. తిలక్‌నగర్ ఆప్ ఎమ్మెల్యే జర్నైల్ సింగ్ రోడ్డు కాంట్రాక్టర్ నుంచి పెద్ద మొత్తంలో 'కమీషన్' డిమాండ్ చేశారని, దానిని ప్రశ్నించినందుకు రౌడీ మూకలతో వచ్చి అక్కడ తీవ్ర హంగామా సృష్టించారని మంత్రి ప్రత్యారోపణలు చేశారు. ఈ ఘర్షణతో రాష్ట్రంలో బీజేపీ, ఆప్‌ల మధ్య రాజకీయ యుద్ధం మొదలైంది.

**ఎన్సీఆర్ దాఖలు చేసిన పోలీసులు**

బాధితుడు సాహిబ్ సింగ్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఢిల్లీ పోలీసులు మంత్రిపై నాన్-కాగ్నిజబుల్ రిపోర్ట్ (ఎన్సీఆర్) నమోదు చేశారు. సాధారణంగా నాన్-కాగ్నిజబుల్ నేరాల విషయంలో దర్యాప్తు జరపాలన్నా లేదా ఎవరినైనా అరెస్ట్ చేయాలన్నా కోర్టు మెజిస్ట్రేట్ నుంచి ముందస్తు ఉత్తర్వులు అవసరమవుతాయి. కాగా, ఇదే గొడవకు సంబంధించిన మరొక ఫిర్యాదుపై కూడా కేసు నమోదు చేసేందుకు పోలీసులు చట్టపరమైన పరిశీలన జరుపుతున్నారు.

స్పందన
జాతీయ తెలుగు దినపత్రిక
మంగళవారం, 29 సెప్టెంబర్ 2026

# సీఎం పర్యటనను విజయవంతం చేయాలి

- కూటమి శ్రేణులకు నాయకుల పిలుపు
- రేపల్లెలో సమన్వయ సమావేశం




రేపల్లె సెప్టెంబర్ 28 స్పంద న్యూస్ :: కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'పేదల సేవలో' కార్యక్రమంలో భాగంగా సీఎం చంద్రబాబు అక్టోబర్ 1న రేపల్లె పట్టణానికి రానున్న నేపథ్యంలో కూటమి పార్టీల ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నారు. సీఎం పర్యటనను విజయవంతం చేసేందుకు రేపల్లె పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కూటమి పార్టీల ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కూటమి శ్రేణులంతా సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీఎం పర్యటన సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చేలా చర్యలు తీసుకోవాలని సమావేశంలో చర్చించారు. పర్యటనకు సంబంధించి కార్యకర్తలకు బాధ్యతలు అప్పగించి, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. రేపల్లె నియోజకవర్గం నలుమూలల నుంచి కూటమి శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమానికి ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో హాజరయ్యేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు.



# సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

**గుంటూరు, సెప్టెంబర్ 28 స్పంద న్యూస్:** గుంటూరు జిల్లాలో ఈ నెల 4వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటించనున్న నేపథ్యంలో పోలీస్ సూపరింటెండెంట్ వకుల్ జిందాల్ తో కలిసి జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ సోమవారం పరిశీలించారు. తెనాలి మండలం బుర్రిపాలెంలో నిర్వహించుటకు ముందుగా ప్రతిపాదించినప్పటికీ, ప్రస్తుతం పెదకాకాని మండలం నంబూరు గ్రామ పంచాయతీ పరిధిలో సభా స్థలి వేదికను పరిశీలించారు. దశావతార దేవాలయం వద్ద ఉన్న స్థలంతో పాటు ఇతర స్థలాలలో అనుకూలతలను తనిఖీ చేశారు. లోపాలు లేకుండా ఏర్పాట్లు పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, డి.ఎస్.పి సి.హెచ్ మురళి కృష్ణ, ఆర్ అండ్ బి పర్యవేక్షక ఇంజనీర్ ఆర్.శ్రీనివాస మూర్తి, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె.కళ్యాణ చక్రవర్తి, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, గృహ నిర్మాణ సంస్థ ఇఇ లు డి.రమాకాంత్, ఎడ్ల భాస్కర రావు, తహసిల్దార్ ఫణి తదితరులు పాల్గొన్నారు.

# పద్మశాలీలు సంఘటితమై ఐక్యంగా ఉండాలి

**తెనాలి, సెప్టెంబర్ 28 (స్పంద న్యూస్):** పద్మశాలి కుల బాంధవులు సంఘటితమై ఐక్యంగా ఉండాలని సామాజికంగా ఆర్థికంగా రాజకీయంగా అభివృద్ధి చెందాలని పద్మశాలి ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు గుద్దంటి వెంకట శివరామకృష్ణ అన్నారు. చీరాల చేనేత వస్త్రోత్పత్తిదారుల సంఘం నందు పద్మశాలి ఉద్యోగుల సంక్షేమ సంఘం బాపట్ల జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బాపట్ల జిల్లా అధ్యక్షులు వావిలాల సాయిబాబు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షులు గుద్దంటి వెంకట శివరామకృష్ణ, డాక్టర్ పున్నారావు, డాక్టర్ దాసరి రామకృష్ణ హనుమాన్, రాష్ట్ర సహాధ్యక్షులు నటరాజ్ కుమార్, పోసా ఏడుకొండలు, బాపట్ల జిల్లా మహిళా అధ్యక్షురాలు బిట్రా సుజాత, శివయ్య, అన్నదాత పాండు రంగారావు, తెనాలి పట్టణ పద్మశాలి ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షులు అందె బాలచంద్రమౌళి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సంఘం స్థాపించి ఐదు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 2026 డిసెంబర్లో అత్యంత వైభవోపేతంగా పద్మశాలి మహిళా చైతన్య సదస్సు నిర్వహణ, సంఘ అభివృద్ధి కార్యక్రమాలు భవిష్యత్ కార్యక్రమాలపై




చర్చించినారు. వెంకట శివరామకృష్ణ మాట్లాడుతూ పద్మశాలి కుల బాంధవులు అందరూ సంఘటితమై ఐక్యంగా ఉండాలని సామాజికంగా ఆర్థికంగా రాజకీయంగా అభివృద్ధి చెందాలని పేద పద్మశాలీ కుల బాంధవులకు ఆర్థికంగా సహాయం చేయాలన్నారు. ఈ సమావేశంలో బాపట్ల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు సుబ్బారావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి దీపాల వెంకట కోటి నాగేశ్వరావు, కోశాధికారి జి. మల్లేష్ కుమార్ ,జిల్లా ఉపాధ్యక్షులు,సహాయ కార్యదర్శులు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మహిళా జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# అర్జీలను గడువులోగా పరిష్కరించాలి

**జీఎంసీ అదనపు కమిషనర్ ఐ. కిషోర్ ఆదేశం**




**గుంటూరు, సెప్టెంబర్ 28 స్పంద న్యూస్:** ప్రజల నుంచి అందే అర్జీలు, ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని గుంటూరు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ ఐ. కిషోర్ విభాగాధిపతులను ఆదేశించారు. నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ ఆదేశాల మేరకు సోమవారం జీఎంసీ కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించిన లి'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లిలో ఆయన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ప్రధానంగా పారిశుధ్యం, డ్రైనేజీ, తాగునీటి సరఫరా, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాలకు సంబంధించిన ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. ఆయా ఫిర్యాదులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. అర్జీల పరిష్కారంలో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే వాటిని దరఖాస్తుదారులకు స్పష్టంగా వివరించి, సంబంధిత సమాచారంతో ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని ఆదేశించారు. నిర్ణీత గడువులోగా ఫిర్యాదులకు పరిష్కారం చూపని అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా మొత్తం 41 అర్జీలు అందాయి. వీటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 7, ఇంజినీరింగ్ విభాగానికి 17, రెవెన్యూ విభాగానికి 10, ప్రజారోగ్య విభాగానికి 4, అకౌంట్స్ విభాగానికి 1, ఉపా సెల్‌కు సంబంధించినవి 2 ఫిర్యాదులు ఉన్నాయి. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సాంబశివరావు, సిఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, ఎస్ఈ జి. వెంకటేశ్వరరావు, డీసీపీ సూరజ్‌కుమార్, ఎంహెచ్ఓ డాక్టర్ సురేష్, వివిధ విభాగాధిపతులు, మేనేజర్ బాలాజీ బాషా తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి స్వాధీనం.. ఇద్దరి అరెస్టు

**ముట్లూరు శ్మశానం సమీపంలో 1.4 కిలోల గంజాయి పట్టివేత**

**వట్టిచెరుకూరు సెప్టెంబర్ 28( స్పంద న్యూస్ ):** మండలంలోని ముట్లూరు గ్రామంలో గంజాయి కలకలం చోటుచేసుకుంది. గ్రామంలోని హిందూ శ్మశానం సమీపంలో గంజాయి సేవించేందుకు ప్రయత్నిస్తున్న ఇద్దరు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 1.4 కిలోల గంజాయి, రూ.800 నగదు స్వాధీనం చేసుకున్నారు. వట్టిచెరుకూరు సీఐ టి. బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ముట్లూరు గ్రామానికి చెందిన అల్లం నరేంద్ర, దేవినేని వెంకటేశ్, అల్లం సాయిసాంబశివరావులు కొంతకాలంగా మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడినట్లు పోలీసులు తెలిపారు. విజయవాడ రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో గుర్తుతెలియని వ్యక్తుల నుంచి గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి, వట్టిచెరుకూరు మండలంలో అధిక ధరకు విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో ముగ్గురు యువకులు విజయవాడకు వెళ్లి సుమారు 1.4 కిలోల గంజాయిని కొనుగోలు చేసి ముట్లూరుకు తీసుకొచ్చినట్లు పోలీసులు పేర్కొన్నారు. అనంతరం గంజాయి సేవించేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో అల్లం నరేంద్ర, దేవినేని వెంకటేశ్‌లను పోలీసులు అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న గంజాయిని, నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. గంజాయి సరఫరా చేసిన వ్యక్తులు, ఇతర సంబంధిత వ్యక్తుల వివరాలపై విచారణ కొనసాగుతున్నట్లు సమాచారం.



# వ్యభిచార ముఠా గుట్టురట్టు

**నిర్వాహకురాలితో సహా ఐదుగురి అరెస్ట్.. 5 సెల్‌ఫోన్లు స్వాధీనం**



**గుంటూరు సెప్టెంబర్ 28 (స్పంద న్యూస్):** నగరంలో వ్యభిచార కార్యకలాపాలపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి ఓ ముఠా గుట్టును రట్టు చేశారు. అరండల్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని భారత్‌పేట 7వ లైన్‌లో ఓ ఇంటిపై టాస్క్‌ఫోర్స్, స్పెషల్ బ్రాంచ్ (ఎస్‌బీ), అరండల్‌పేట పోలీసులు సంయుక్తంగా దాడి చేసి నిర్వాహకురాలితో పాటు ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌బీ డీఎస్పీ ఆదేశాల మేరకు, టాస్క్‌ఫోర్స్ సీఐ పర్యవేక్షణలో వ్యభిచార కార్యకలాపాలపై పోలీసులు నిఘా కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో భారత్‌పేట 7వ లైన్‌లోని ఓ ఇంట్లో వ్యభిచార కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో ఆదివారం మధ్యాహ్నం సుమారు 12:45 గంటల సమయంలో పోలీసులు దాడి నిర్వహించారు. దాడి సమయంలో ఇంట్లో ఉన్న నలుగురు మహిళలతో పాటు ఓ పురుషుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి మొత్తం 5 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రాథమిక పోలీసు విచారణలో గోరంట్లకు చెందిన పి. సాయి లక్ష్మి అలియాస్ అంజలి ఈ వ్యవహారానికి నిర్వాహకురాలిగా వ్యవహరిస్తున్నట్లు గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. విటులను ఆకర్షించేందుకు వాట్సాప్ ద్వారా యువతుల ఫొటోలు పంపుతూ డీల్స్ కుదుర్చుకుంటున్నట్లు పోలీసులు గుర్తించినట్లు వెల్లడించారు. అదుపులోకి తీసుకున్న ఐదుగురిని తదుపరి విచారణ, చట్టపరమైన చర్యల నిమిత్తం అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# టీడీపీలోకి మునగాల మల్లేశ్వరరావు

**లోకేష్ సమక్షంలో చేరికకు రంగం సిద్ధం?**

**మంగళగిరి సెప్టెంబర్ 28 స్పంద న్యూస్ :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మంగళగిరి పట్టణ మాజీ అధ్యక్షుడు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మునగాల మల్లేశ్వరరావు తెలుగుదేశం పార్టీలో చేరనున్నట్లు సమాచారం. తన సతీమణి మునగాల భాగ్యలక్ష్మితో కలిసి ఆయన టీడీపీ తీర్థం పుచ్చుకోనున్నట్లు తెలుస్తోంది. మంగళగిరి నియోజకవర్గానికి చెందిన మల్లేశ్వరరావు రాజకీయంగా గతంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కీలక బాధ్యతలు నిర్వహించారు. మంగళగిరి పట్టణ మాజీ అధ్యక్షుడిగా, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్‌గా పనిచేశారు. ఈ నేపథ్యంలో మల్లేశ్వరరావు దంపతులు ఈరోజు సాయంత్రం తాడేపల్లిలో ఐటీ, విద్యాశాఖ మంత్రి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరనున్నట్లు సమాచారం. అయితే చేరికకు సంబంధించి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. మల్లేశ్వరరావు టీడీపీలో చేరికతో మంగళగిరి నియోజకవర్గ రాజకీయాల్లో ఈ పరిణామం చర్చనీయాంశంగా మారింది.



# రాజ్యాంగ వ్యవస్థలపై రాహుల్ విమర్శలు సరికాదు

**బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాశ్ నారాయణ**

**గుంటూరు సెప్టెంబర్ 28(స్పంద న్యూస్ )::** రాజ్యాంగబద్ధ సంస్థలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలు చేయడం సరికాదని బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాశ్ నారాయణ అన్నారు. చంద్రమౌళి నగర్‌లోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఓటమి ఎదురైన ప్రతిసారీ కాంగ్రెస్ నాయకులు ఈవీఎంలపై ఆరోపణలు చేయడం పరిపాటిగా మారిందన్నారు. కేరళ, కర్ణాటక, తెలంగాణలో గెలిచినప్పుడు ఈవీఎంలపై అనుమానాలు వ్యక్తం చేయలేదని, ఓటమి తర్వాతే ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించిన వివరాల ఆధారంగానే ఓటర్ల జాబితా సవరణ జరుగుతోందని తెలిపారు. ఎన్నికల సంఘం చట్టానికి లోబడి పనిచేస్తోందని, దాని స్వయం ప్రతిపత్తిని గౌరవించాలని సూచించారు. ఎన్నికల సంఘం నియామక ప్రక్రియలో ప్రతిపక్ష నేతకు కూడా భాగస్వామ్యం కల్పించామని, ఆ ప్రక్రియలో భాగమైన రాహుల్ గాంధీ ఇప్పుడు ఎన్నికల సంఘంపై ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. దేశ రక్షణ వ్యవస్థపైనా గతంలో అనుచిత ఆరోపణలు చేశారని పేర్కొన్నారు. ఎన్నికల సంఘంపై చేసిన ఆరోపణలకు రాహుల్ గాంధీ ప్రజలకు, రాజ్యాంగానికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని జయప్రకాశ్ నారాయణ డిమాండ్ చేశారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి దర్శనపు శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలపాటి రవికుమార్, రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్ తాడువాయి రామకృష్ణ, బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజాపక్షమే
స్పంద
జాతీయ తెలుగు దినపత్రిక
మంగళవారం, 29 సెప్టెంబర్ 2026



## ఎంబీబీఎస్ 2వ రౌండ్ అడ్మిషన్లు రద్దు చేయాలి: కేసన శంకరరావు

**మంగళగిరి, సెప్టెంబర్ 28 (స్పంద న్యూస్):** డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం ఇటీవల విడుదల చేసిన ఎంబీబీఎస్ రెండవ రౌండ్ సీట్ల కేటాయింపులో తీవ్ర లోపాలు చోటుచేసుకున్నాయని, వాటిని తక్షణమే రద్దు చేసి అర్హులైన రిజర్వేషన్ వర్గాలకు న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు డిమాండ్ చేశారు. సోమవారం మంగళగిరిలోని రాష్ట్ర కార్యాలయంలో నీట్ యూజీ సీట్ల కేటాయింపు అంశంపై నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో అమలులో ఉన్న 151 జీవో ప్రకారం మెరిట్ సాధించిన బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ముందుగా ఓపెన్ కేటగిరీలో, ఆ తర్వాతి వారికి రిజర్వేషన్ కోటాలో సీట్లు ఇచ్చేవారని కేసన శంకరరావు గుర్తుచేశారు. కానీ, ప్రస్తుత 102 జీవో వల్ల మెరిట్ సాధించిన రిజర్వేషన్ అభ్యర్థులను కూడా నేరుగా రిజర్వేషన్ కేటగిరీలోనే జమ చేస్తున్నారని, దీనివల్ల సుమారు 70 మంది రిజర్వేషన్ వర్గాల విద్యార్థులు ఎంబీబీఎస్ సీట్లు కోల్పోయారని మండిపడ్డారు. ఉదాహరణకు, 31,325 నీట్ ర్యాంక్ సాధించిన బీసీ-బి విద్యార్థి సాయి కార్తీక్‌కు ఓపెన్ కేటగిరీలో రావాల్సిన సీటును రిజర్వేషన్ కింద కేటాయించడంతో ఒక బీసీ సీటు నష్టం జరిగిందని వివరించారు. రెండవ రౌండ్‌లో కేటాయించిన ఓపెన్ సీట్లలో 90 శాతానికి పైగా ఓసీలకే దక్కేలా విశ్వవిద్యాలయం సాఫ్ట్‌వేర్ రూపొందించడం అన్యాయమని శంకరరావు విమర్శించారు. హెల్త్ యూనివర్సిటీ వెంటనే స్పందించి రెండవ రౌండ్ అడ్మిషన్లను రద్దు చేయాలని, ప్రతీ విద్యార్థికి అన్ని కాలేజీల వెబ్ ఆప్షన్లు ఇచ్చుకునే హక్కును కాపాడాలని కోరారు. మెరిట్ దామాషా ప్రకారం అన్ని వర్గాలకు ఓపెన్ సీట్లలో సమాన అవకాశాలు వచ్చేలా సాఫ్ట్‌వేర్‌ను మార్చి తిరిగి పారదర్శకంగా కౌన్సెలింగ్ నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీసీ నేతలు శివలింగం ప్రసాద్, శివరావు గౌడ్, కోటేశ్వరరావు, దానా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ ఆధ్వర్యంలో భగత్ సింగ్ జయంతి



**చీరాల, సెప్టెంబర్ 28 (స్పంద న్యూస్):** స్వాతంత్ర్య సమరయోధుడు, అమర వీరుడు భగత్ సింగ్ జయంతి వేడుకను బిజెపి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సోమవారం స్థానిక బిజెపి కార్యాలయంలో స్థానిక నాయకులు భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాన్ని బాపట్ల జిల్లా బిజెపి అధ్యక్షులు మువ్వల వెంకట రమణ, బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు డాక్టర్ తాడివలస దేవరాజు ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాంపల్లి జగన్నాథ శాస్త్రి పాల్గొనగా భగత్ సింగ్ జయంతిని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ తాడివలస దేవరాజు, రాంపల్లి జగన్నాథ శాస్త్రి మాట్లాడుతూ, భగత్ సింగ్ దేశ స్వాతంత్ర్యం కోసం చేసిన త్యాగాలు, యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. దేశం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన భగత్ సింగ్ ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈనాటి కార్యక్రమంలో మత్స్యకార సెల్ జిల్లా కన్వీనర్ మోపిదేవి శ్రీనివాస్ రావు, యువ మోర్చా నాయకులు నాయుడు వెంకటరాజు, జిల్లా ఆఫీస్ సెక్రటరీ కర్పూరపు విజయ్ కుమార్, బాపట్ల రూరల్ మండలం ఉపాధ్యక్షులు బడుగు నాగేశ్వరావు, బీజేపీ నాయకులు, ఓబీసీ మోర్చా కార్యకర్తలు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా విద్యాశాఖ అధికారి

**గుంటూరు సెప్టెంబర్ 28 (స్పంద న్యూస్) :** గుంటూరు జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ సలీం భాష గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని పాత బస్టాండ్ వద్ద గల ప్రభుత్వ ఉన్నత పాఠశాల తనిఖీ చేసి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు బొర్రా నాగేశ్వరరావు మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేపు ఉదయం 7 గంటల నుండి జరిగే పాఠశాల యాజమాన్య కమిటీలకు సర్వం ఏర్పాటు చేసుకోవాలని, ఎన్నికలను సజావుగా, ప్రభుత్వ నిబంధన ప్రకారము పకడ్బందీగా ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు సమిష్టిగా నిర్వహించాలని అన్నారు వేణుగోపాల్‌నగర్‌లోని ఎస్‌కేబిపియం మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి అక్కడ విద్యార్థులకు అమలవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్నబడి భోజనాన్ని పరిశీలించి, నాణ్యత విషయంలో ఎటువంటి రాజీ పడవద్దు అని అన్నారు .అనంతరం ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి రేపు జరిగే పాఠశాల యాజమాన్యం కమిటీ ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షించారు ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు , ఉపాధ్యాయులు పాల్గొన్నారు





# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటం

- 2న రాష్ట్రవ్యాప్తంగా 'కోరికల దినోత్సవం'.. కలెక్టర్లకు వినతిపత్రాలు
- అక్టోబర్ 20లోపు ఏపీడబ్ల్యూజే సభ్యత్వ నమోదు పూర్తి చేయాలి
- ఏపీడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షుడు ఐ.వి. సుబ్బారావు



**గుంటూరు, సెప్టెంబర్ 28 (స్పంద న్యూస్):** జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఒక్కరూ ఐక్యంగా ఉద్యమించాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఏపీడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షుడు ఐ.వి. సుబ్బారావు పిలుపునిచ్చారు. జర్నలిస్టుల డిమాండ్లను ఒక్కరోజు నిరసనలకే పరిమితం చేయకుండా, సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యే వరకు నిరంతరం పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. గుంటూరులో నిర్వహించిన ఏపీడబ్ల్యూజే జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. విధి నిర్వహణలో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు, వేధింపులను అరికట్టేందుకు రాష్ట్రంలో ప్రత్యేక జర్నలిస్టుల రక్షణ చట్టాన్ని తీసుకురావాలని ఐ.వి. సుబ్బారావు డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, సంక్షేమ పథకాలు, హెల్త్‌కార్డు నిధుల విడుదల మరియు కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించే చర్యలను బలోపేతం చేయాలన్నారు. అలాగే చిన్న, మధ్య తరహా పత్రికలు, ఛానళ్లకు ప్రభుత్వ ప్రకటనలు సమానంగా అందేలా చూడాలని, జర్నలిస్టుల సంక్షేమానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు అక్టోబర్ 2న రాష్ట్రవ్యాప్తంగా 'కోరికల దినోత్సవం' నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని జిల్లా కేంద్రాల్లో మహాత్మా గాంధీ విగ్రహాల వద్ద నిరసనలు తెలిపి, కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేస్తామన్నారు. అనంతరం అక్టోబర్ 1 నుంచి 20 వరకు ఏపీడబ్ల్యూజే సభ్యత్వ నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని, అక్టోబర్ రెండో వారంలో తదుపరి ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు ఏచూరి శివ, బాపట్ల, పల్నాడు జిల్లాల అధ్యక్షులు సీహెచ్. రాంబాబు, భువన, గుంటూరు జిల్లా అధ్యక్షుడు ఎస్.ఎన్. మీరా, కార్యదర్శి కె. రాంబాబు, జాతీయ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# దుర్గమ్మ దసరాకు 'మెగా' ఏర్పాట్లు

- 25 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా
- భక్తుల సౌకర్యమే ప్రథమ ప్రాధాన్యం.. భద్రతే ప్రధాన బాధ్యత
- ఇన్‌చార్జి మంత్రి వై. సత్యకుమార్ యాదవ్
- ఇంద్రకీలాద్రి ఉత్సవాల ఉన్నత స్థాయి సమీక్ష




ఇంద్రకీలాద్రి, సెప్టెంబర్ 28 (స్పంద న్యూస్): విజయవాడ ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో అక్టోబర్ 11 నుండి 20 వరకు వైభవంగా నిర్వహించనున్న శ్రీ పరాభవ నామ సంవత్సర దసరా శరన్నవరాత్రి మహోత్సవాల సమగ్ర ఏర్పాట్లపై సోమవారం ఉదయం ఉన్నత స్థాయి సమన్వయ సమావేశం జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి మరియు జిల్లా ఇన్-ఛార్జ్ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్సీ వర్ల రామయ్య, నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు, దేవాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్, జాయింట్ కలెక్టర్ జి. ఇలక్కియ, మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్, ఆలయ ఈవో శీనా నాయక్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ దసరా మహోత్సవాలకు సాధారణ భక్తులతో పాటు భవానీ దీక్షల విరమణకు వచ్చే భక్తులు కలిపి దాదాపు 25 లక్షల మందికి పైగా తరలివచ్చే అవకాశముందని తెలిపారు. భక్తులకు క్యూలైన్లలో ఎండ, వర్షం తగలకుండా షెడ్లు, నిరంతర తాగునీరు, ఎల్ఈడీ స్క్రీన్లు, ఉచిత అన్నప్రసాద వితరణతో పాటు అత్యున్నత నాణ్యతతో 60 లక్షల లడ్డూ ప్రసాదాలను సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. వీఐపీ సంస్కృతికి తావులేకుండా సామాన్య భక్తులకే ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని, క్యూలైన్లలో చంటిపిల్లల కోసం వేడిపాలు, బిస్కెట్లు అందించేలా ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీ చిన్ని, ఎమ్మెల్సీ వర్ల రామయ్య పేర్కొన్నారు. శాంతిభద్రతలు, రద్దీ నియంత్రణ కోసం పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్లు సీపీ రాజశేఖర్ బాబు తెలిపారు. సరికొత్త ఏఐ కెమెరాలు, సీసీటీవీ పర్యవేక్షణ, 24 గంటలు పనిచేసే కంట్రోల్ రూమ్‌తో పాటు నగర శివార్లలో పటిష్టమైన పార్కింగ్ కేంద్రాలను కేటాయించి, అక్కడ నుండి ఉచిత షటిల్ బస్సులను నడపనున్నట్లు వివరించారు. ఆర్జిత పూజల టికెట్లను దేవాదాయ శాఖ వెబ్‌సైట్ మరియు 'మనమిత్ర' వాట్సాప్ (9552300009) ద్వారా బుక్ చేసుకోవచ్చని, జీపీఎస్ ఆధారిత పారిశుద్ధ్య పర్యవేక్షణ ఉంటుందని అధికారులు వెల్లడించారు. అన్ని ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేసి దసరా మహోత్సవాలను దిగ్విజయంగా నిర్వహించాలని సమావేశంలో తీర్మానించారు.

# 4న బుర్రిపాలెంలో సీఎం పర్యటన

- 3డీ సాంకేతికతతో ఇళ్ల నిర్మాణ కార్యక్రమానికి శ్రీకారం
- ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ 2.0 కింద ఆధునిక గృహ నిర్మాణాలు



**గుంటూరు, సెప్టెంబర్ 28 (స్పంద న్యూస్):** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్టోబర్ 4న గుంటూరు జిల్లాలో పర్యటించనున్నారు. తెనాలి మండలం బుర్రిపాలెంలో పర్యటించే సీఎం, కేంద్ర ప్రభుత్వ 'ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ 2.0' పథకంలో భాగంగా 3డీ ప్రింటింగ్ సాంకేతికతతో నిర్మించే ఇళ్ల నిర్మాణ ప్రక్రియను అధికారికంగా ప్రారంభించనున్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను త్వరితగతిన సాకారం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఈ నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అమల్లోకి తెస్తోంది. సంప్రదాయ నిర్మాణ పద్ధతులతో పోలిస్తే 3డీ సాంకేతికత ద్వారా అత్యంత వేగంగా, నాణ్యతా ప్రమాణాలతో ఇళ్లను నిర్మించే వీలుంటుందని అధికారులు తెలిపారు. తక్కువ సమయంలోనే లబ్ధిదారులకు పక్కా ఇళ్లను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. బుర్రిపాలెం పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించడంతో పాటు, సంబంధిత అధికారులు మరియు ప్రజాప్రతినిధులతో పథకం అమలు, లబ్ధిదారుల ఎంపిక, మౌలిక వసతుల కల్పన మరియు నిర్మాణ పురోగతిపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించనున్నారు. ఈ 3డీ ఇళ్ల నిర్మాణ ప్రాజెక్టు రాష్ట్రంలో రాబోయే రోజుల్లో ఆధునిక సాంకేతిక గృహ నిర్మాణానికి ఒక మోడల్‌గా నిలవనుందని అధికారులు స్పష్టం చేశారు.

# టీడీపీలో చేరిన మంగళగిరి నియోజకవర్గ వైసీపీ నేతలు!

### ఉండవల్లిలో మంత్రి లోకేష్ సమక్షంలో చేరికలు

**ఉండవల్లి సెప్టెంబర్ 28 స్పంద న్యూస్ :** మంగళగిరి నియోజకవర్గానికి చెందిన పలువురు వైసీపీ నేతలు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఉండవల్లిలో జరిగిన కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్ సమక్షంలో వీరంతా టీడీపీ కండువాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించారు. మంగళగిరి పట్టణానికి చెందిన వైసీపీ మాజీ అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు కుటుంబ సభ్యులు టీడీపీలో చేరారు. అలాగే తాడేపల్లి రూరల్ పరిధిలోని ఉండవల్లికి చెందిన మాజీ ఎంపీటీసీ కళ్లం సంజీవ్ రెడ్డి కూడా తెలుగుదేశం పార్టీలో చేరారు. తాడేపల్లి పట్టణానికి చెందిన దుర్గగుడి ట్రస్ట్ బోర్డు మాజీ ప్రత్యేక ఆహ్వానితుడు, వైసీపీ సీనియర్ నేత జక్కిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సైతం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. నిడమర్రుకు చెందిన వైసీపీ సీనియర్ నేత కట్టెపోగు బాబురావు కూడా పార్టీ మారారు. ఇదే కార్యక్రమంలో గుంటూరు బ్రాహ్మణ సంఘం కార్యదర్శి వేమవరపు నారాయణ తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరితో పాటు పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు కూడా టీడీపీకి మద్దతు ప్రకటించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.



### అభివృద్ధి, సంక్షేమానికి ఆకర్షితులై చేరికలు

ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరుతున్నారని పార్టీ నాయకులు పేర్కొన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా నాయకత్వం పనిచేస్తోందన్నారు. మంత్రి లోకేష్ సమక్షంలో జరిగిన ఈ చేరికలతో నియోజకవర్గంలో ఉత్సాహం నెలకొంది. కొత్తగా పార్టీలో చేరిన నాయకులు టీడీపీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కొత్తగా పార్టీలో చేరిన వారికి అభినందనలు తెలిపారు.

ప్రజాగళమే
స్పంద
జాతీయ తెలుగు దినపత్రిక



# గిల్ రికార్డుల జోరు..

## ఒకే మ్యాచ్‌లో అరుదైన ఘనతలు

**తిరువనంతపురం, సెప్టెంబర్ 28 (స్పంద న్యూస్):** వెస్టిండీస్‌తో జరిగిన తొలి వన్డేలో భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అద్భుత సెంచరీతో ఆకట్టుకున్నాడు. తిరువనంతపురంలో జరిగిన మ్యాచ్‌లో 295 పరుగుల లక్ష్యాన్ని భారత్ 41.4 ఓవర్లలోనే ఛేదించింది. గిల్ 110 పరుగులు చేయగా.. విరాట్ కోహ్లీ 139 పరుగులతో అజేయంగా నిలిచాడు. వీరిద్దరూ రెండో వికెట్‌కు 151 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు.

### 67 ఇన్నింగ్స్‌ల్లో 10 సెంచరీలు

వెస్టిండీస్‌పై సాధించిన శతకంతో గిల్ వన్డేల్లో 10 సెంచరీలు పూర్తి చేసుకున్నాడు. 67 ఇన్నింగ్స్‌ల్లోనే ఈ మైలురాయిని చేరుకున్న గిల్.. భారత బ్యాటర్లలో అత్యంత వేగంగా 10 వన్డే శతకాలు చేసిన ఆటగాడిగా నిలిచాడు. శిఖర్ ధావన్ 77 ఇన్నింగ్స్‌ల్లో ఈ ఘనత సాధించగా.. విరాట్ కోహ్లీకి తొలి 10 వన్డే సెంచరీలకు 80 ఇన్నింగ్స్‌లు పట్టాయి.

### ఆమ్లా రికార్డుతో సమంగా..

మొదటి 67 వన్డే ఇన్నింగ్స్‌ల్లో గిల్ 3,489 పరుగులు సాధించాడు. ఈ క్రమంలో దక్షిణాఫ్రికా మాజీ బ్యాటర్ హాషిమ్ ఆమ్లా 3,453 పరుగుల రికార్డును అధిగమించాడు. అంతేకాకుండా తొలి 67 ఇన్నింగ్స్‌ల్లో అత్యధికంగా 50కిపైగా స్కోర్లు సాధించిన బ్యాటర్ల జాబితాలోనూ గిల్ ఆమ్లాతో కలిసి 30 స్కోర్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచాడు.

### కెప్టెన్‌గా పరుగుల వరద

వన్డే కెప్టెన్‌గా తొలి 12 ఇన్నింగ్స్‌ల్లో గిల్ అత్యధిక పరుగులు సాధించిన భారత ఆటగాడిగా నిలిచాడనే గణాంకం కూడా అతడి బ్యాటింగ్ స్థాయిని చాటుతోంది. కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత బ్యాట్‌తోనూ జట్టుకు అండగా నిలుస్తున్న గిల్.. 2027 ప్రపంచకప్ సన్నాహకాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాడు. గిల్ ప్రస్తుతం వన్డేల్లో భారత జట్టుకు నాయకత్వం వహిస్తున్నాడు.

### 3 వేల పరుగుల మైలురాయి

గిల్ వన్డేల్లో 3 వేల పరుగులను 61 ఇన్నింగ్స్‌ల్లో పూర్తి చేశాడు. అయితే ప్రపంచ రికార్డు విషయంలో మూల కథనంలోని సమాచారం సరిచేయాల్సి ఉంది. 3 వేల పరుగులను అత్యంత వేగంగా పూర్తి చేసిన బ్యాటర్ హాషిమ్ ఆమ్లా.. 57 ఇన్నింగ్స్‌ల్లోనే ఈ ఘనత సాధించాడు. గిల్ ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాడు.

### అంతర్జాతీయ సెంచరీల్లోనూ దూకుడు

వెస్టిండీస్‌పై చేసిన శతకంతో గిల్ అంతర్జాతీయ క్రికెట్‌లో తన సెంచరీల సంఖ్యను 22కు చేర్చుకున్నాడు. 27 ఏళ్ల వయసులోనే ఈ స్థాయికి చేరుకున్న గిల్.. రాబోయే రోజుల్లో మరిన్ని రికార్డులు బద్దలు కొట్టే అవకాశం ఉంది. తొలి వన్డేలో గిల్, కోహ్లీ సెంచరీలతో భారత్ ఎనిమిది వికెట్ల తేడాతో విజయం సాధించింది.




# ఆసియా క్రీడల్లో భారత్‌కు రెండు పతకాలు



**నాగోయా, సెప్టెంబర్ 28 (స్పంద న్యూస్):** ప్రతిష్ఠాత్మక ఆసియా క్రీడల్లో భారత క్రీడాకారులు తొమ్మిదో రోజూ పతకాలతో సత్తా చాటారు. షూటింగ్‌లో మహిళల 25 మీటర్ల పిస్టల్ వ్యక్తిగత విభాగంలో ఇషా సింగ్ రజత పతకం సాధించగా.. కురాష్‌లో పింకీ బల్హారా కాంస్య పతకంతో మెరిసింది. మరోవైపు డిస్కస్ త్రోలో సీమా పూనియా నాలుగో స్థానంతో పతకాన్ని చేజార్చుకుంది. మహిళల 25 మీటర్ల పిస్టల్ వ్యక్తిగత విభాగంలో ఇషా సింగ్ అద్భుత ప్రదర్శనతో రజత పతకం సాధించింది. ఆసియా క్రీడల షూటింగ్ విభాగంలో భారత పతకాల ఖాతాలో మరో పతకాన్ని చేర్చింది. పతకం కోసం జరిగిన పోరులో ఇషా చివరి వరకు గట్టిగా పోరాడింది. మహిళల 78 కిలోల కురాష్ విభాగంలో పింకీ బల్హారా కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. క్వార్టర్ ఫైనల్లో గరమ్ లిమ్‌ను ఓడించిన పింకీ.. సెమీఫైనల్లో సుమిమ్ మో చేతిలో పరాజయం పాలైంది. మోకాలి గాయంతో బాధపడుతున్నప్పటికీ పింకీ పోరాటం కొనసాగించింది. అయితే ప్రత్యర్థి మోకాలి ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకుని దాడులు చేయడంతో పింకీకి ఎదురుదెబ్బ తగిలింది. 2018 జకర్తా ఆసియా క్రీడల్లో పింకీ 54 కిలోల విభాగంలో రజత పతకం సాధించింది. ఈసారి 78 కిలోల విభాగంలో కాంస్యంతో మరో ఆసియా క్రీడల పతకాన్ని తన ఖాతాలో వేసుకుంది. మహిళల డిస్కస్ త్రోలో భారత స్టార్ అథ్లెట్ సీమా పూనియా పతకానికి అడుగు దూరంలో నిలిచింది. ఫైనల్లో ఆమె 59.88 మీటర్ల దూరం డిస్కస్‌ను విసిరి తన అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేసినప్పటికీ.. నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది. దీంతో ఆసియా క్రీడల్లో మరో పతకం సాధించాలన్న సీమా పూనియా ఆశలు నెరవేరలేదు.

# వర్షం దెబ్బకు పాక్‌కు సెమీస్ బెర్త్

**నాగోయా, సెప్టెంబర్ 28 (స్పంద న్యూస్):** ఆసియా క్రీడల పురుషుల క్రికెట్‌లో పాకిస్థాన్ జట్టు ఒక్క బంతి కూడా పడకుండానే సెమీఫైనల్‌కు చేరుకుంది. హాంకాంగ్‌తో జరగాల్సిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌కు భారీ వర్షం అంతరాయం కలిగించడంతో పోటీని రద్దు చేశారు. దీంతో మెరుగైన ఐసీసీ టీ20 ర్యాంకింగ్ ఆధారంగా పాకిస్థాన్ నేరుగా సెమీఫైనల్ బెర్త్ దక్కించుకుంది. నిషీన్‌లోని కోరోగి స్పోర్ట్స్ పార్క్‌లో మ్యాచ్ జరగాల్సి ఉండగా.. ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో మైదానం పూర్తిగా తడిసిపోయింది. పరిస్థితులు అనుకూలించకపోవడంతో టాస్ కూడా నిర్వహించలేకపోయారు. చివరకు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. దీంతో హాంకాంగ్ టోర్నీ నుంచి నిష్క్రమించగా.. పాకిస్థాన్ ముందంజ వేసింది. మరో క్వార్టర్ ఫైనల్లో బంగ్లాదేశ్, మలేషియా జట్లు తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌లో విజేతతో పాకిస్థాన్ సెమీఫైనల్లో తలపడనుంది. సాహిబ్జాదా ఫర్హాన్ నేతృత్వంలోని పాకిస్థాన్ జట్టు ఈ టోర్నీలో బరిలోకి దిగింది. మరో క్వార్టర్ ఫైనల్లో భారత్, అఫ్ఘనిస్థాన్ తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌కూ వర్షం ముప్పు పొంచి ఉంది. ఒకవేళ వర్షం కారణంగా మ్యాచ్ రద్దయితే.. మెరుగైన ర్యాంకింగ్ కారణంగా భారత్ సెమీఫైనల్‌కు చేరుకునే అవకాశం ఉంటుంది. టీ20 ర్యాంకింగ్స్‌లో భారత్ అగ్రస్థానంలో ఉండగా.. అఫ్ఘనిస్థాన్ పదో స్థానంలో ఉంది. గత ఆసియా క్రీడల్లోనూ వర్షం కారణంగా ఫైనల్ రద్దవడంతో మెరుగైన సీడింగ్ ఆధారంగా భారత్‌కు స్వర్ణం దక్కిన విషయం తెలిసిందే.




# ఈషా సింగ్‌కు రజతం.. పింకీకి కాంస్యం

**నాగోయా, సెప్టెంబర్ 28 (స్పంద న్యూస్):** ఆసియా క్రీడలు-2026లో భారత షూటర్ ఈషా సింగ్ సత్తా చాటింది. మహిళల 25 మీటర్ల పిస్టల్ విభాగంలో రజత పతకం సాధించింది. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్లో స్వర్ణం కోసం చివరి వరకు పోరాడిన ఈషా.. టైబ్రేకర్‌లో చైనా షూటర్ జియావో చేతిలో ఓటమి పాలైంది. 21 ఏళ్ల ఈషా సింగ్ ఫైనల్లో ఏకంగా ఆరు షూటాఫ్‌లను ఎదుర్కొంది. ఇందులో నాలుగు షూటాఫ్‌లు రజత, కాంస్య పతకాల కోసం జరగగా.. మరో రెండు స్వర్ణం కోసం జరిగాయి. ప్రతి దశలో ఒత్తిడిని తట్టుకుని అద్భుతంగా రాణించిన ఈషా.. చివరి టైబ్రేకర్‌లో మాత్రం 2-3 తేడాతో ఓడిపోయింది. ఫైనల్లో ఓ దశలో నాలుగో స్థానానికి పడిపోయిన ఈషాకు పతకం కూడా దక్కే పరిస్థితి కనిపించలేదు. అయితే కీలక సమయంలో పుంజుకున్న ఆమె.. వరుసగా ఐదు షాట్లలో ఐదింటినీ లక్ష్యాన్ని తాకించి పతకాన్ని ఖాయం చేసుకుంది. చివరకు ఒక్క షాట్ తేడాతో స్వర్ణాన్ని చేజార్చుకుని రజతంతో సరిపెట్టుకుంది. కురాష్ మహిళల 78 కిలోల విభాగంలో భారత అథ్లెట్ పింకీ బల్హారాకు కాంస్య పతకం దక్కింది. సెమీఫైనల్లో దక్షిణ కొరియా అథ్లెట్ చేతిలో 0-5 తేడాతో ఓటమి పాలైన పింకీ.. కాంస్యంతో టోర్నీని ముగించింది. బాక్సింగ్‌లో ఒలింపిక్ కాంస్య పతక విజేత లవ్లీనా బోర్గోహైన్ మరో పతకాన్ని ఖాయం చేసుకుంది. మహిళల 75 కిలోల విభాగంలో క్వార్టర్ ఫైనల్లో దక్షిణ కొరియాకు చెందిన సియోంగ్ సుయోన్‌ను 5-0 తేడాతో ఓడించి సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. దీంతో ఆసియా క్రీడల్లో బాక్సింగ్‌లో వరుసగా రెండో పతకాన్ని సాధించే దిశగా ముందడుగు వేసింది.




# రాయలసీమ జెన్ స్టార్స్ గ్రాండ్ విక్టరీ

## తొలి మహిళల ఏపీఎల్ కప్ మనదే!

### ఫైనల్లో గోదావరి ఈగిల్స్‌ను చిత్తు చేసిన రాయలసీమ..

**6 వికెట్లతో డబ్ల్యూఏపీఎల్ విజేతగా రికార్డు.. విజేతలకు మంత్రి నారా లోకేష్ ఘన అభినందనలు**

**మంగళగిరి, సెప్టెంబర్ 28 (స్పంద న్యూస్):** ఆంధ్రప్రదేశ్ క్రికెట్ చరిత్రలో సరికొత్త అధ్యాయానికి తెరలేపుతూ నిర్వహించిన తొలి మహిళల ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూఏపీఎల్-2026)లో రాయలసీమ జెన్ స్టార్స్ గర్జించింది. మంగళగిరి మైదానంలో జరిగిన హోరాహోరీ ఫైనల్ సమరంలో గోదావరి గోల్డెన్ ఈగిల్స్‌ను 6 వికెట్ల తేడాతో చిత్తు చేసి, తొలి డబ్ల్యూఏపీఎల్ ఛాంపియన్‌గా రాయలసీమ జెన్ స్టార్స్ చరిత్ర సృష్టించింది. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన ఈ లీగ్, రాష్ట్ర మహిళా క్రికెటర్ల సత్తాను దేశానికి చాటిచెప్పేలా సాగింది. టైటిల్ పోరులో రాయలసీమ జెన్ స్టార్స్ ఆల్‌రౌండ్ విరుచుకుపాటైంది. ప్రత్యర్థి గోదావరి గోల్డెన్ ఈగిల్స్ విసిరిన లక్ష్యాన్ని రాయలసీమ ప్లేయర్లు సాధికారికంగా ఛేదించారు. బౌలింగ్‌లో ప్రత్యర్థిని కట్టడి చేయడమే కాకుండా, ఛేజింగ్‌లో విరుచుకుపడి 6 వికెట్లు మిగిలుండగానే ఘనవిజయాన్ని అందుకొని పసిడి ట్రోఫీని ముద్దాడారు. తొలి మహిళల ఏపీఎల్ ట్రోఫీని ముద్దాడిన రాయలసీమ జెన్ స్టార్స్ జట్టుకు, చివరివరకు గట్టి పోటీ ఇచ్చిన గోదావరి గోల్డెన్ ఈగిల్స్‌కు రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ఘన అభినందనలు తెలిపారు. మన మహిళా క్రీడాకారుల ప్రతిభకు ఈ టోర్నీ నిజమైన వేదికగా నిలిచిందని కొనియాడారు. విజవంతమైన తొలి సీజన్ స్ఫూర్తితో వచ్చే ఏడాది విశాఖపట్నం, కడప వేదికలుగా టోర్నీని మరింత భారీగా నిర్వహించేందుకు ఏసీఏ సిద్ధమవుతోంది.








# నైజాంలో 'ది ప్యారడైజ్' జోరు

## ఒక్కరోజే రూ.4.7 కోట్లు

**హైదరాబాద్, సెప్టెంబర్ 28 (స్పంద న్యూస్):** నేచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కిన 'ది ప్యారడైజ్' బాక్సాఫీస్ వద్ద జోరు కొనసాగిస్తోంది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ రా అండ్ రస్టిక్ యాక్షన్ డ్రామాకు మిశ్రమ స్పందన లభించింది. కథనం, నిడివి, కొన్ని సన్నివేశాలపై ప్రేక్షకుల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనప్పటికీ.. వసూళ్లపై మాత్రం ఆ ప్రభావం పూర్తిగా కనిపించడం లేదని ట్రేడ్ వర్గాల గణాంకాలు సూచిస్తున్నాయి. ముఖ్యంగా నైజాం ప్రాంతంలో 'ది ప్యారడైజ్' చెప్పుకోదగ్గ వసూళ్లు సాధించినట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు ఈ ప్రాంతంలో సుమారు రూ.27.5 కోట్ల షేర్ వచ్చినట్లు ట్రేడ్ వర్గాల సమాచారం. ఆదివారం ఒక్కరోజే దాదాపు రూ.4.7 కోట్ల షేర్ రాబట్టినట్లు తెలుస్తోంది. ఈ లెక్కలు జీఎస్టీ మినహాయించి ఉన్నట్లు సమాచారం. హైదరాబాద్‌తో పాటు నైజాం పరిధిలోని పలు కేంద్రాల్లో తొలి వారాంతంలో ఆక్యుపెన్సీ బలంగా నమోదైనట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా కూడా 'ది ప్యారడైజ్' మంచి ప్రారంభాన్ని నమోదు చేసింది. మూడు రోజుల్లోనే రూ.136 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించినట్లు చిత్ర నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటించింది. ఉత్తర అమెరికా మార్కెట్‌లోనూ 20 లక్షల డాలర్లకు పైగా గ్రాస్ వచ్చినట్లు సమాచారం. దీంతో తమ హీరో నాని కెరీర్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా 'ది ప్యారడైజ్' నిలిచిందని చిత్రబృందం పేర్కొంటోంది. అయితే తొలి వారాంతం పూర్తవడంతో సోమవారం నుంచి సినిమాకు అసలు పరీక్ష మొదలుకానుంది. సెలవుల ప్రభావం లేకుండా సాధారణ పనిదినాల్లోనూ ప్రేక్షకులను థియేటర్లకు రప్పించగలిగితేనే వసూళ్ల జోరు కొనసాగుతుంది. ముఖ్యంగా నైజాం ప్రాంతంలో సోమవారం నుంచి కలెక్షన్లు ఏ స్థాయిలో నిలబడతాయన్నది ట్రేడ్ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

# కయాదుకు చాన్సులే చాన్సులు!

## వరుస సినిమాలతో కయాదు జోరు

**హైదరాబాద్, సెప్టెంబర్ 28 (స్పంద న్యూస్):** యువ కథానాయిక కయాదు లోహర్ వరుస సినిమాలతో దూసుకుపోతున్నారు. గ్లామర్ పాత్రలతో పాటు నటనకు ప్రాధాన్యమున్న కథలను ఎంచుకుంటూ దక్షిణాది చిత్రసీమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ ఏడాది ఆమె నటించిన పలు చిత్రాలు ప్రేక్షకుల ముందుకు రావడంతో కెరీర్‌లో జోరు పెరిగింది. కయాదు నటించిన 'ఫంకీ', 'హృదయం మురళి', 'పల్లీ చట్టాంబి', 'ఐమ్ గేమ్', 'ఇమ్మోర్టల్', 'ది ప్యారడైజ్' చిత్రాలు ఈ ఏడాదిలోనే ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. ఒకే ఏడాదిలో ఆరు చిత్రాలతో సందడి చేయడం ఆమె కెరీర్‌లో ఉన్న వేగానికి నిదర్శనంగా సినీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇప్పటివరకు కయాదు నటించిన కొన్ని చిత్రాలు ఆశించిన స్థాయిలో వాణిజ్య విజయాన్ని అందుకోకపోయినా ఆమెకు వస్తున్న అవకాశాలు మాత్రం తగ్గడం లేదు. కేవలం గ్లామర్‌కే పరిమితం కాకుండా కథలో ప్రాధాన్యమున్న విభిన్న పాత్రల్లో కనిపించేందుకు ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. దీంతో దర్శక, నిర్మాతల దృష్టి ఆమెపై కొనసాగుతోంది. ప్రస్తుతం కయాదు తమిళ చిత్రసీమలోనూ వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నట్లు సమాచారం. స్టార్ హీరోలు శివకార్తికేయన్, సూర్య సరసన ప్రతిష్ఠాత్మక చిత్రాల్లో అవకాశాలు దక్కినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ చిత్రాలు ఆమె కెరీర్‌కు కీలకంగా మారే అవకాశముందని భావిస్తున్నారు. వరుస విడుదలలతో ప్రేక్షకులకు మరింత చేరువైన కయాదు ఇప్పుడు రాబోయే భారీ చిత్రాలపై ఆశలు పెట్టుకున్నారు. ముఖ్యంగా తమిళంలో చేస్తున్న ప్రాజెక్టులు విజయవంతమైతే దక్షిణాదిలో ఆమెకు మరిన్ని అవకాశాలు దక్కవచ్చన్న చర్చ సాగుతోంది. దీంతో కయాదు తదుపరి చిత్రాలపై సినీ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.





# చిన్న వయసులోనే వరుస ఛాన్సులు

## 20 ఏళ్లకే వరుస సినిమాలు..

**హైదరాబాద్, సెప్టెంబర్ 28 (స్పంద న్యూస్):** తెలుగు చిత్రసీమలో కొత్త కథానాయికల సందడి పెరుగుతోంది. కొందరు అందంతో ఆకట్టుకుంటే.. మరికొందరు నటనకు ప్రాధాన్యమున్న పాత్రలను ఎంచుకుంటూ తమకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంటు న్నారు. ముఖ్యంగా చిన్న వయసులోనే వెండితెరపై అడుగుపెట్టి వరుస అవకాశాలను అందుకుంటున్న యువ నటీమణుల జాబితాలో అనంతిక సునీల్ కుమార్ పేరు కూడా చేరింది. 'మ్యాడ్' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన అనంతిక తొలి సినిమాతోనే తన సహజ నటన, స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఆకట్టుకుంది. పెద్దగా సినీ అనుభవం లేకపోయినా తెరపై సహజంగా కనిపిస్తూ యువ ప్రేక్షకుల్లో గుర్తింపు సంపాదించుకుంది. 'మ్యాడ్' తర్వాత అనంతికకు వరుస అవకాశాలు వచ్చాయి. తమిళంలో రజనీకాంత్ నటించిన 'లాల్ సలామ్'లోనూ కనిపించింది. ఆ తర్వాత మరిన్ని చిత్రాల్లో నటిస్తూ కెరీర్‌ను ముందుకు తీసుకెళ్తోంది. ప్రస్తుతం కొత్త ప్రాజెక్టులతో బిజీగా ఉన్నట్లు సినీ వర్గాల సమాచారం. సుమారు 20 ఏళ్ల వయసులోనే వరుస చిత్రాలతో ముందుకు సాగుతున్న అననతిక తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకునే ప్రయత్నంలో ఉంది. సినిమాలతో పాటు సామాజిక మాధ్యమాల్లోనూ చురుగ్గా ఉంటూ తాజా ఫొటోలు, సినిమా విశేషాలను అభిమానులతో పంచుకుంటోంది. రాబోయే చిత్రాలు ఆమె కెరీర్‌కు ఎలాంటి మలుపు ఇస్తాయన్నది ఆసక్తికరంగా మారింది.

# రకుల్ ప్రీత్ సింగ్‌కు షాక్..

## 12 చోట్ల ఐటీ సోదాలు



**ముంబై, సెప్టెంబర్ 28 (స్పంద న్యూస్):** బాలీవుడ్ నటి రకుల్ ప్రీత్ సింగ్, ఆమె మామ, సినీ నిర్మాత వాసు భగ్నానీ, పనోరమా స్టూడియోస్‌కు సంబంధించిన పలు ప్రదేశాల్లో ఆదాయపు పన్ను శాఖ సోదాలు నిర్వహిస్తోంది. ముంబైలో మొత్తం 12 ప్రాంతాల్లో ఈ తనిఖీలు జరుగుతున్నట్లు పలు వార్తా సంస్థలు వెల్లడించాయి. సినిమాల నిర్మాణం, ఫైనాన్సింగ్‌కు సంబంధించిన నిధుల లావాదేవీలపై అనుమానాల నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టినట్లు సమాచారం. సినిమా ప్రాజెక్టులకు ఫైనాన్సింగ్ పేరుతో నిధులను విదేశాలకు తరలించినట్లు వచ్చిన ఆరోపణలపై అధికారులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ముంబై ఆదాయపు పన్ను శాఖకు చెందిన బృందాలు పలు ప్రాంతాల్లో పత్రాలు, ఆర్థిక రికార్డులు, విదేశీ లావాదేవీల వివరాలను పరిశీలిస్తున్నాయి. అయితే ఇప్పటివరకు సోదాల్లో ఎలాంటి అక్రమాలు బయటపడ్డాయనే విషయంపై అధికారిక ప్రకటన వెలువడలేదు. ఇదిలా ఉంటే.. రకుల్ ప్రీత్ సింగ్ సోదరుడు అమన్ ప్రీత్ సింగ్ పేరు 2025 డిసెంబరులో హైదరాబాద్‌లో నమోదైన డ్రగ్స్ కేసులో వెలుగులోకి వచ్చింది. డిసెంబరు 19న ఇద్దరు వ్యాపారులను అరెస్టు చేసిన పోలీసులు వారి వద్ద నుంచి 43.7 గ్రాముల కొకైన్, 11.5 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం చేసుకున్నారు. విచారణలో అమన్ ప్రీత్ సింగ్ సహా పలువురి పేర్లు వెలుగులోకి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల ప్రకారం.. అమన్ ప్రీత్ సింగ్ ఆ ఇద్దరు వ్యక్తుల నుంచి ఐదుసార్లు మాదకద్రవ్యాలు కొనుగోలు చేసి ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. అయితే ఈ డ్రగ్స్ కేసు, ప్రస్తుతం జరుగుతున్న ఆదాయపు పన్ను శాఖ సోదాలు రెండూ వేర్వేరు వ్యవహారాలు. తాజా ఐటీ తనిఖీలకు సంబంధించి అధికారికంగా తుది ఫలితాలు వెల్లడికావాల్సి ఉంది.

"This newspaper is published by **JAMMUGANI MOHAN** from D.No. 13-19 Selapadu, Guntur, Andhrapradesh - 522213. on behalf of AK PUBLICATIONS, Editor by **JAMMUGANI MOHAN** and printed by JANAPATI VENKATA RAMESH BABU at D.NO. 5-74A, GANGIREDDY PALEM, BELLAMKONDA, GUNTUR, ANDHRA PRADESH - 522411." **PRGI NO: APMUL/26/A3106**. Email: epaper.spandanews@gmail.com , Cell: **94908 24686**

ప్రజాగళమే స్పంద జాతీయ తెలుగు దినపత్రిక
మంగళవారం, 29 సెప్టెంబర్ 2026



# ప్రత్తిపాడులో 'అంగన్‌వాడీ మిలన్'

**ప్రత్తిపాడు, సెప్టెంబర్ 28 (స్పంద న్యూస్):** సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రత్తిపాడు మండలంలో బిజేపి, టిడిపి నాయకులు ఉమ్మడిగా 'అంగన్‌వాడీ మిలన్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బిజేపి మహిళా మోర్చా కోశాధికారి డాక్టర్ సిహెచ్.ఎస్. స్రవంతి, ప్రత్తిపాడు బిజేపి మండల అధ్యక్షుడు దత్త ప్రసాద్ ఆధ్వర్యంలో నాయకులు మండలంలోని దాదాపు 10 అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల పనితీరును, చిన్నారులకు అందిస్తున్న పోషకాహారాన్ని ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'బాలామృతం', 'ప్రధానమంత్రి మాతృ వందన యోజన' వంటి పథకాల అమలుపై లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహిస్తున్న టీచర్లు, ఏఎన్ఎంలు మరియు ఆయాలను నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిజేపి నాయకులు మహిళా మోర్చా రాధిక, శ్రీ లలిత, కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి శెట్టి శ్రీరామయ్య, మట్టా వెంకటేశ్వర్లు, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు గింజుపల్లి శివరామ ప్రసాద్, తెదేపా నాయకుడు అంజిరెడ్డి, స్థానిక సీడీపీవో తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులు ఎంఎల్‌సి ఓటు హక్కు నమోదు చేసుకోండి

**యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వట్టెపు.**



**దాచేపల్లి, సెప్టెంబరు 29(స్పందన్యూస్):** అర్హులైన ఉపాధ్యాయులు ఎంఎల్ సి ఎన్నిక కు ఫారం 19 ను పూర్తి చేసి ఓటు హక్కు నమోదు చేసుకోవాలని యూటీఎఫ్ పల్నాడు జిల్లా కార్యదర్శి వట్టెపు నాగేశ్వరరావు సూచించారు. సోమవారం యూటీఎఫ్ దాచేపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో దాచేపల్లిలోని వివిధ పాఠశాలలని సందర్శించి,2027 మార్చిలో జరిగే కృష్ణ, గుంటూరు జిల్లాల టీచర్ ఎంఎల్‌సి ఎన్నిక కు ఓటు నమోదు కోసం ఫారం 19 ని అందజేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా యూటీఫ్ జిల్లా కార్యదర్శి వి.నాగేశ్వరరావు మాట్లాడుతూ అర్హులైన ఉపాధ్యాయులు అందరూ ఓటర్ గా నమోదు కావాలని ఎంఎల్‌సి అభ్యర్థిగా యూటీఫ్ తో పాటు ఇతర ఉపాధ్యాయ,అధ్యాపక,కార్మిక సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి హనుమంతరావు అభ్యర్థిత్వాన్ని బలపచాలని కోరారు..ఈ కార్యక్రమంలో యూటీఫ్ మండల అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు టి.ఆనంద్ కుమార్,రాజారావు,మస్తాన్ వలి,నాగుల్ మీరా, పూర్ణ చంద్రరావు,,వాసు, శ్రీనివాసరావు,అబ్దుల్లా వలి,సాయిబాబా ఆయా పాఠ శాలల ప్రిన్సిపాల్స్, ప్రధానో పాధ్యాయులు పాల్గొన్నారు.

# 76 వార్డులకు తుది పోలింగ్ కేంద్రాల జాబితా



**గుంటూరు, సెప్టెంబర్ 28 స్పంద న్యూస్:** గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని 76 వార్డులకు సంబంధించిన తుది పోలింగ్ కేంద్రాల జాబితాను విడుదల చేసినట్లు కమిషనర్, అదనపు ఎన్నికల ప్రాధికార సంస్థ అధికారి కె. మయూర్ అశోక్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన సర్క్యులర్ నెం. 526/ఎస్ఈసీ-ఎఫ్ 1/2026, తేదీ 21-09-2026 ప్రకారం వార్డుల వారీగా తుది పోలింగ్ కేంద్రాల జాబితా అనుబంధం-6లో సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. ఈ జాబితాను గుంటూరు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, అన్ని వార్డు కార్యాలయాలు, నగరంలోని ముఖ్య ప్రదేశాల్లో ప్రజల పరిశీలనకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఓటర్లు తమ వార్డుకు సంబంధించిన పోలింగ్ కేంద్రం వివరాలను ముందుగానే పరిశీలించుకోవచ్చని పేర్కొన్నారు.

# నేడు లాల్‌పురం పరిధిలో 3 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేత

**ఎస్సీసీఏడీఏ పనుల కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరాకు అంతరాయం**

**గుంటూరు, సెప్టెంబర్ 28 (స్పంద న్యూస్ ):** గుంటూరు డి-12 విద్యుత్ విభాగం పరిధిలోని పలు ప్రాంతాల్లో సెప్టెంబర్ 29న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోనుంది. కొత్త లాలాపురం విద్యుత్ ఉపకేంద్రంలో ఎస్సీసీఏడీఏ పనులు చేపట్టనున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ అంతరాయం కారణంగా కృష్ణబాబు కాలనీ, జోసెఫ్ కాలనీ, వీఐపీ రోడ్డు, లాలాపురం గ్రామం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులు సూచించారు.

# వైద్య వ్యర్థాలను సాధారణ చెత్తతో కలపొద్దు

**ఆసుపత్రులు, నిర్ధారణ కేంద్రాల నిర్వాహకులకు నగరపాలక సంస్థ సూచన**




**గుంటూరు, సెప్టెంబర్ 28 (స్పంద న్యూస్ ):** ఆసుపత్రులు, నిర్ధారణ కేంద్రాల నుంచి వెలువడే జీవ వైద్య వ్యర్థాలు, ఆసుపత్రి వ్యర్థాలు, ఎక్స్‌రే ఫిల్ములు, రేడియోధార్మిక వ్యర్థాలను సాధారణ చెత్తతో కలపకుండా ప్రత్యేకంగా వేరు చేసి అందజేయాలని గుంటూరు నగరపాలక సంస్థ ముఖ్య వైద్యాధికారి డాక్టర్ శాంతి కళ సూచించారు. నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ ఆదేశాల మేరకు సోమవారం కౌన్సిల్ సమావేశ మందిరంలో నగరంలోని ఆసుపత్రులు, నిర్ధారణ కేంద్రాల నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శాంతి కళ మాట్లాడుతూ, రేడియోధార్మిక పదార్థాలు సాధారణ వ్యర్థాలతో కలిస్తే పారిశుధ్య కార్మికులు, ప్రజలు, పర్యావరణానికి ప్రమాదం కలిగే అవకాశం ఉందన్నారు. ఎక్స్‌రే, సీటీ స్కాన్, ఎంఆర్ఐ ఫిల్ములు, రేడియోధార్మిక మందులు, కలుషితమైన సిరంజీలు, గ్లౌజులు, దూది, రోగుల విసర్జకాలు, కలుషిత వస్త్రాలు, రేడియోథెరపీలో ఉపయోగించే పదార్థాలను ప్రత్యేకంగా నిర్వహించాలని సూచించారు. ఇలాంటి వ్యర్థాలను అవి ఉత్పత్తయ్యే ప్రదేశంలోనే వేరు చేసి, సంబంధిత నిబంధనల ప్రకారం సురక్షితంగా పారవేయాలని ఆసుపత్రుల యాజమాన్యాలను ఆదేశించారు. నగర పరిశుభ్రత, ప్రజారోగ్య పరిరక్షణకు నిర్వాహకులు సహకరించాలని కోరారు. సమావేశంలో ఎంహెచ్ఓ డాక్టర్ సురేష్, శానిటరీ సూపర్వైజర్లు, సిబ్బంది, వివిధ ఆసుపత్రుల ప్రతినిధులు పాల్గొన్నారు.

# బృందావన్ గార్డెన్స్ రోడ్డు విస్తరణ పనులు వేగవంతం

- సెంటర్ డివైడర్, బీటీ రోడ్డు నిర్మాణానికి టెండర్లు పూర్తి చేయాలి
- కమిషనర్ మయూర్ అశోక్



**గుంటూరు, సెప్టెంబర్ 28 (స్పంద న్యూస్):** నగరంలోని బృందావన్ గార్డెన్స్ నుంచి హనుమయ్య కంపెనీ వరకు రోడ్డు విస్తరణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో సోమవారం పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులతో రోడ్డు విస్తరణ పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రోడ్డు విస్తరణకు సంబంధించిన పట్టణ ప్రణాళిక విభాగం పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అవసరమైన భవనాల తొలగింపునకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భవనాల తొలగింపు పూర్తయిన ప్రాంతాల్లో డ్రైన్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. అలాగే సెంటర్ డివైడర్, బీటీ రోడ్డు నిర్మాణానికి టెండర్ ప్రక్రియను పూర్తి చేసి పనులను త్వరగా ప్రారంభించాలని ఆదేశించారు. పనులు జరుగుతున్న సమయంలో పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని, విద్యుత్ శాఖతో సమన్వయం చేసుకుని అవసరమైన ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను తరలించాలని సూచించారు. రోడ్డు విస్తరణ సమయంలో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.సమావేశంలో ఎస్ఈ జి. వెంకటేశ్వరరావు, ఈఈ విష్ణు, ఏసీపీ రెహమాన్, డీఈఈ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# నేపాల్ వరదల్లో గల్లంతైన భారతీయుల గుర్తింపునకు డీఎన్ఏ నమూనాల సేకరణ

**సమీప రక్తసంబంధీకుల నుంచి జీవ నమూనాలు సేకరించాలని కేంద్రం ఆదేశాలు**

**బాధిత కుటుంబాలు వెంటనే పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలి: కృష్ణా జిల్లా ఎస్పీ**




**విజయవాడ, సెప్టెంబర్ 28 (స్పంద న్యూస్):** నేపాల్‌లో ఇటీవల సంభవించిన తీవ్ర ఆకస్మిక వరదల్లో గల్లంతైన భారతీయ పౌరులను, లభ్యమయ్యే మృతదేహాలు లేదా అవశేషాలను శాస్త్రీయంగా గుర్తించేందుకు డీఎన్ఏ నమూనాల సేకరణ ప్రక్రియ చేపట్టనున్నట్లు కృష్ణా జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు ఐపీఎస్ తెలిపారు. బాధితుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేసేందుకు గల్లంతైన వారి సమీప రక్తసంబంధీకులైన తల్లిదండ్రులు, పిల్లలు లేదా తోబుట్టువుల నుంచి డీఎన్ఏ పరీక్షల కోసం జీవ నమూనాలు సేకరించాలని కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసిందని ఆయన వెల్లడించారు.

**పోలీస్ స్టేషన్‌లో వివరాలు నమోదు చేయాలి**

నేపాల్ వరద ప్రమాదంలో తమ కుటుంబ సభ్యులు లేదా బంధువులు గల్లంతైనట్లు సమాచారం ఉన్న కృష్ణా జిల్లాకు చెందిన బాధిత కుటుంబాలు వెంటనే తమ సమీపంలోని పోలీస్ స్టేషన్‌ను సంప్రదించి సమగ్ర వివరాలు అందించాలని ఎస్పీ సూచించారు. బాధితులకు అవసరమైన పూర్తి సహాయ సహకారాలు అందించడంతో పాటు, ప్రభుత్వ ఫోరెన్సిక్ శాస్త్ర ప్రయోగశాల ద్వారా ఉచితంగా డీఎన్ఏ జీవ నమూనాలు సేకరించేలా పోలీసు అధికారులు సమన్వయం వహిస్తారని తెలిపారు.

**బాధిత కుటుంబాలు సహకరించాలి**

ఈ కష్ట సమయంలో గల్లంతైన వారి కుటుంబ సభ్యులు తమ వివరాలను పోలీస్ స్టేషన్‌లో నమోదు చేయించి డీఎన్ఏ సేకరణ ప్రక్రియకు పూర్తిస్థాయిలో సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. జిల్లా పరిధిలో నేపాల్ వరద బాధితులు ఉన్నట్లయితే వారి వివరాలను తక్షణమే సేకరించి, ఉన్నతాధికారులు మరియు సంబంధిత విభాగాలతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని కృష్ణా జిల్లా పోలీసు యంత్రాంగాన్ని ఎస్పీ ఆదేశించారు.

# మృతిచెందిన ఏఎస్సై కుటుంబానికి రూ.20.45 లక్షల బీమా చెక్కు

**గ్రూప్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ పాలసీ ద్వారా ఆర్థిక సాయం అందించిన గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్**



**గుంటూరు, సెప్టెంబర్ 28 (స్పంద న్యూస్):** విధి నిర్వహణలో పోలీసు శాఖకు సేవలందించిన మృతిచెందిన ఏఎస్సై కుటుంబానికి గుంటూరు జిల్లా పోలీస్ శాఖ అండగా నిలిచింది. నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహించిన ఏఎస్సై (1699) వాసిమళ్ళ రత్నరాజు కుటుంబానికి గ్రూప్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ పాలసీ పథకం ద్వారా రూ.20,45,000 ఆర్థిక సాయాన్ని అందించారు. కొల్లూరు మండలం ఈపూర్ లంక గ్రామానికి చెందిన వాసిమళ్ళ రత్నరాజు గత జూన్ 13, 2026న మృతిచెందారు. ఆయన కుటుంబానికి బీమా పథకం ద్వారా మంజూరైన రూ.20,45,000 మొత్తానికి సంబంధించిన చెక్కును గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఐపీఎస్ సోమవారం మృతుడి భార్య బుజ్జి, కుమార్తె, కుమారుడికి అందజేశారు.

**కుటుంబానికి పోలీస్ శాఖ అండ**

పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తూ మృతిచెందిన సిబ్బంది కుటుంబాలకు అందుబాటులో ఉన్న సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక భరోసా కల్పించేందుకు శాఖ చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగానే గ్రూప్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ పాలసీ కింద రత్నరాజు కుటుంబానికి ఈ మొత్తాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందల్ కుటుంబ సభ్యులను పరామర్శించి, పోలీస్ శాఖ తరఫున వారికి అండగా ఉంటామని తెలిపారు. కుటుంబానికి అందాల్సిన సంక్షేమ ప్రయోజనాలను సకాలంలో అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ ఇన్సూరెన్స్ పాలసీ అధికారులు, బి-సెక్షన్ సూపరింటెండెంట్ జి. రమాదేవి, మృతిచెందిన ఏఎస్సై వాసిమళ్ళ రత్నరాజు భార్య బుజ్జి, కుమార్తె, కుమారుడు, ఇతర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. పోలీస్ శాఖలో పనిచేసే సిబ్బంది కుటుంబాలకు సంక్షేమ పథకాలు ఆర్థికంగా అండగా నిలుస్తాయని అధికారులు పేర్కొన్నారు. మృతిచెందిన సిబ్బంది కుటుంబాల సంక్షేమానికి శాఖ పరంగా అందాల్సిన సహాయాన్ని అందించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.

ప్రజాగళమే
స్పంద
జాతీయ తెలుగు దినపత్రిక
మంగళవారం, 29 సెప్టెంబర్ 2026

# ఓటు హక్కు పరిరక్షణ కోసం కాంగ్రెస్ భారీ నిరసన



- సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్
- ఓటర్ల జాబితాల సవరణపై సమగ్ర విచారణకు కాంగ్రెస్ పట్టు



**విజయవాడ, సెప్టెంబర్ 28 (స్పంద న్యూస్):** ప్రజాస్వామ్యానికి పునాది అయిన ఓటు హక్కును పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) ఆధ్వర్యంలో విజయవాడలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియ, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత లేకపోవడంపై కాంగ్రెస్ నాయకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ ఆందోళనలో కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నాయి. విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ ఎన్నికల సంఘం కార్యాలయం వరకు సాగింది. కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలి, సీనియర్ నాయకులు జేడీ సీలం (జేడీసీ) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల నాయకులు, డీసీసీ ప్రతినిధులు, ఓబీసీ, యూత్, మహిళా మరియు కిసాన్ కాంగ్రెస్ నాయకులు భారీగా పాల్గొన్నారు.

### ప్రధాన ఎన్నికల కమిషనర్‌పై తీవ్ర ఆరోపణలు:

ముఖ్య ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ వ్యవహారశైలిపై కాంగ్రెస్ నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రక్రియలో సంపూర్ణ పారదర్శకత పాటించాలని, ఓటర్ల జాబితా సవరణ పేరుతో అర్హులైన ఒక్క ఓటరును కూడా అన్యాయంగా తొలగించకూడదని స్పష్టం చేశారు. రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర సంస్థగా ఎన్నికల కమిషన్ నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, ప్రజాస్వామ్యంపై ప్రజల్లో అనుమానాలు తలెత్తకుండా చూడాలని డిమాండ్ చేశారు.

### 13 కోట్ల ఓట్ల తొలగింపుపై స్పష్టత:

ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా దేశవ్యాప్తంగా డ్రాఫ్ట్ రోల్స్ నుంచి దాదాపు 13 కోట్ల ఓటర్ల పేర్లు తొలగించబడ్డాయనే నివేదికలను ప్రస్తావిస్తూ కాంగ్రెస్ నాయకులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. అయితే, అనర్హులు, మరణించినవారు మరియు డూప్లికేట్ నమోదులను ఏరివేయడమే ఎస్ఐఆర్ ముఖ్య ఉద్దేశమని, అధికారిక తుది జాబితాలో అర్హులైన ఓటర్లకు ఎలాంటి భంగం వాటిల్లదని ఎన్నికల సంఘం ఇప్పటికే స్పష్టం చేసింది.

### సిఐడి, న్యాయ విచారణకు డిమాండ్

రాష్ట్ర ఓబీసీ కాంగ్రెస్ అధ్యక్షుడు శొంఠి నాగరాజు మాట్లాడుతూ, ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను బాధ్యుడిని చేస్తూ చర్యలు తీసుకోవాలని, అవసరమైతే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అనంతరం కాంగ్రెస్ శ్రేణులు సీఈసీ జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మను దహనం చేసి రోడ్డుపై ధర్నా నిర్వహించాయి. రాహుల్ గాంధీ సైతం దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాల సవరణలోని లోపాలపై పోరాడుతున్నారని ప్రస్తావించిన నాయకులు, అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడే వరకు కాంగ్రెస్ పార్టీ ప్రజల తరఫున రాజీలేని పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.



# డ్రంక్ అండ్ డ్రైవ్‌కు పాల్పడిన ఇద్దరికి కోర్టు జరిమానా

**యడ్లపాడు సెప్టెంబర్ 28 స్పంద న్యూస్ :** పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఇద్దరు వ్యక్తులను చట్టపరమైన చర్యల నిమిత్తం ద్వితీయ శ్రేణి న్యాయస్థానం ఎదుట హాజరపరిచినట్లు ఎస్సై తెలిపారు. కేసులను విచారించిన న్యాయస్థానం, మద్యం సేవించి వాహనం నడిపిన ఇద్దరు వ్యక్తులకు ఒక్కొక్కరికి రూ.10,000/- చొప్పున, మొత్తం రూ.20,000/- జరిమానా విధించింది. ఈ సందర్భంగా ఎడ్లపాడు ఎస్ఐ శివరామకృష్ణ మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల డ్రైవర్‌తో పాటు ఇతర వాహనదారులు, పాదచారుల ప్రాణాలకు కూడా ప్రమాదం ఏర్పడుతుందని తెలిపారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను నిరంతరం కొనసాగిస్తామని, మద్యం సేవించి వాహనం నడిపే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు మద్యం సేవించిన అనంతరం వాహనం నడపకుండా, ప్రత్యామ్నాయ రవాణా సదుపాయాలను వినియోగించుకోవాలని, రహదారి భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

# గుంటూరులో బీజేపీ కిసాన్ మోర్చా జోనల్ సమావేశం

### గ్రామస్థాయిలో విస్తరణ.. రైతుల సమస్యల పరిష్కారంపై దృష్టి



**గుంటూరు, సెప్టెంబర్ 28 (స్పంద న్యూస్):** గుంటూరులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో కిసాన్ మోర్చా ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జోనల్ సమావేశం జరిగింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు వై.వి. సుబ్బారావు, వి. సురేంద్రనాథ్ రెడ్డి పర్యవేక్షణలో, జోనల్ ఇన్‌చార్జి దండు అభిలాష్ రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి, బీజేపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. రాష్ట్రంలోని సుమారు 16 వేల గ్రామాల్లో ఇప్పటికే 5 వేల గ్రామాల్లో కిసాన్ మోర్చా కమిటీలు ఏర్పాటు చేసినట్లు కుమారస్వామి తెలిపారు. మిగిలిన గ్రామాల్లోనూ కమిటీల ఏర్పాటు వేగవంతం చేయాలని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని, రైతులతో నిరంతరం సంబంధాలు కొనసాగిస్తూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. భూ సర్వే, ముఖ్యంగా 22-ఏ భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు కిసాన్ మోర్చా నాయకులు చొరవ చూపాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అడ్లపట్టి స్వరూప రాణి సూచించారు. సమావేశంలో రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాష్ నారాయణ, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చరకా కుమార్ గౌడ్, పార్టీ నాయకులు, కిసాన్ మోర్చా రాష్ట్ర, జిల్లా పదాధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉత్తమ బీచ్‌గా బాపట్ల సూర్యలంక

### అవార్డు దక్కడం గర్వకారణం: ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ



**బాపట్ల, సెప్టెంబర్ 28 (స్పంద న్యూస్):** బాపట్ల సూర్యలంక సముద్ర తీరం రాష్ట్రస్థాయిలో ఉత్తమ బీచ్‌గా ఎంపిక కావడం పట్ల బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ హర్షం వ్యక్తం చేశారు. ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ అందించిన ఈ గుర్తింపు బాపట్ల జిల్లా ప్రజలకు గర్వకారణమని తెలిపారు. సూర్యలంకకు ప్రతిష్ఠాత్మక అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం పర్యాటక రంగ అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందని, ఇందులో భాగంగా సూర్యలంక తీరాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ 'స్వదేశీ దర్శన్ 2.0' పథకం నిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో బీచ్ వద్ద మౌలిక వసతులు, పర్యాటకుల భద్రత, ఆధునిక సదుపాయాలను మరింత మెరుగుపరుస్తామని చెప్పారు. సూర్యలంకను గోవా తరహా పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడమే లక్ష్యమన్నారు. ఉత్తమ బీచ్ అవార్డు సాధించేందుకు కృషి చేసిన పర్యాటక శాఖ అధికారులు, జిల్లా యంత్రాంగానికి ఎమ్మెల్యే నరేంద్ర వర్మ అభినందనలు తెలిపారు.

# వైసీపీ మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌పై చీటింగ్ కేసు

### అమ్మిన భూమిని తనఖా పెట్టి రూ.3 కోట్ల రుణం తీసుకున్నారన్న ఆరోపణలు

**తెనాలి, సెప్టెంబర్ 28 (స్పంద న్యూస్):** వైసీపీ మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, ఆయన భార్య పుష్పతో పాటు మరో వ్యక్తిపై తెనాలి వన్‌టౌన్ పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. ఫైనాన్స్ సంస్థ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదైంది. ఫైనాన్స్ సంస్థ ఫిర్యాదు ప్రకారం.. 2019లో శివకుమార్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఆయన భార్య నిర్వహిస్తున్న సంస్థకు రూ.3 కోట్ల రుణం మంజూరైంది. రుణానికి శివకుమార్ హామీదారుగా ఉండగా, తెనాలిలోని 1,200 చదరపు గజాల స్థలాన్ని తనఖాగా చూపినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే రుణ వాయిదాలు సక్రమంగా చెల్లించకపోవడంతో వడ్డీలతో కలిపి బకాయి రూ.5 కోట్లకు పైగా పెరిగినట్లు ఫైనాన్స్ సంస్థ తెలిపింది. బకాయి వసూలు కోసం తనఖా ఆస్తిని పరిశీలించగా, 1,200 గజాల్లో 500 గజాలను 2012లోనే ఇతరులకు విక్రయించినట్లు మున్సిపల్ రికార్డుల ద్వారా తెలిసిందని పేర్కొంది. అమ్మేసిన భూమిని కూడా తనఖాగా చూపించి రుణం పొందినట్లు ఫైనాన్స్ సంస్థ ఆరోపించింది. నాటి ఎమ్మెల్యే హోదాను దుర్వినియోగం చేశారని, రిజిస్ట్రేషన్ ప్రక్రియలోనూ అవకతవకలు జరిగి ఉండవచ్చని ఫిర్యాదులో పేర్కొంది. ఈ ఫిర్యాదు ఆధారంగా అన్నాబత్తుని శివకుమార్, ఆయన భార్య పుష్ప, కంపెనీ మేనేజింగ్ పార్ట్‌నర్ తూనుగుంట్ల శ్రీనివాస్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెనాలి వన్‌టౌన్ సీఐ సీహెచ్ రాంబాబు తెలిపారు. ఫిర్యాదులోని ఆరోపణలు దర్యాప్తులో నిర్ధారణ కావాల్సి ఉంది.



# జాషువా జయంతి సందర్భంగా బీజేపీ నేతల నివాళి

### అసమానతలను తన రచనలతో ప్రశ్నించిన మహాకవి: వల్లూరు జయప్రకాశ్ నారాయణ



**గుంటూరు, సెప్టెంబర్ 28 (స్పంద న్యూస్):** మహాకవి గుర్రం జాషువా 131వ జయంతి సందర్భంగా గుంటూరు నగరంపాలెం సెంటర్‌లోని ఆయన విగ్రహానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు డాక్టర్ దారా అంబేద్కర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ నారాయణ మాట్లాడుతూ.. సమాజంలో నెలకొన్న అసమానతలు, అస్పృశ్యతను జాషువా తన కవితలు, రచనల ద్వారా ప్రశ్నించారని తెలిపారు. ముఖ్యంగా 'గబ్బిలం', 'ఫిరదౌసి' వంటి రచనల ద్వారా సామాజిక చైతన్యాన్ని కలిగించారని పేర్కొన్నారు. బీజేపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ జాషువా కవితలు, రచనలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని, ఆయన సాహిత్య స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ కొనసాగించాలని అన్నారు. కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి కూడా జాషువా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంతేటి బ్రహ్మయ్య, ప్రధాన కార్యదర్శి రాయపూడి ఏసుబాబు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బజరంగ్ రామకృష్ణ, ఉపాధ్యక్షురాలు కత్తిమేరి సరోజిని, సీనియర్ నాయకుడు పొట్రు పూర్ణచంద్రరావు, ఎస్సీ మోర్చా జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ పెరికల ఆనందరాజు తదితరులు పాల్గొన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# పల్నాడు జిల్లాలో చోరీ కేసుల ఛేదింపు : నలుగురు నిందితుల అరెస్ట్

### నిందితుల నుంచి 362 గ్రా. బంగారు, 5.9 కేజీల వెండి ఆభరణాలు, రూ. 1.02 లక్షల నగదు స్వాధీనం



**చిలకలూరిపేట సెప్టెంబర్ 28 స్పందన్యూస్ :** పల్నాడు జిల్లాలో చోరీ కేసుల ఛేదింపుపై వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ జగదీష్ అదహల్లి (ఐపీఎస్), ఎడ్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన చోరీ కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. ఎడ్లపాడు, నాదెండ్ల, చిలకలూరిపేట పరిధిలో మొత్తం నాలుగు కేసులను పోలీసులు ఛేదించారు. నిందితుల నుంచి 362 గ్రాముల బంగారు ఆభరణాలు, 5.9 కిలోల వెండి ఆభరణాలు, రూ. 1.02 లక్షల నగదు రికవరీ చేసినట్లు ఎస్పీ వెల్లడించారు. అయితే, చోరీ సొత్తులో మరికొంత బంగారం రికవరీ కావాల్సి ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కేసుల దర్యాప్తులో సీసీటీవీలు, ఇతర ఆధారాలను పరిశీలించి నిందితులను గుర్తించినట్లు ఎస్పీ తెలిపారు. నిందితుల విచారణలో పలు చోరీ కేసులకు సంబంధించిన వివరాలు వెలుగులోకి వచ్చినట్లు ఆయన వివరించారు. చోరీ చేసిన సొత్తును విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న సమయంలోనే నిందితులను పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. చోరీ కేసులను ఛేదించిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి, వారికి రివార్డులు అందజేశారు.